Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

## పోలీస్ అధికారి భార్య హత్య

- నేపాలీ గ్యాంగ్‌గా అనుమానం
- క్లూ ఆధారంగా వేంగంగా విచారణ
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 8 : జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజా (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరా బాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం

11 లో

## కొడంగల్‌పైనే కాదు..రాష్ట్రంపై శ్రద్ద పెట్టాలి

- బిఆర్ఎస్ ప్రాజెక్టులతో డబ్బులు వృధా చేసింది
- ఎక్కడా కాల్వలు నిర్మించి నీళ్లు పారించలేదు
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 8 : రిజర్వాయర్ల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేసినా రైతులకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వలేకపోయారని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రిజర్వాయర్లు నిర్మించడం

11 లో

సంపుటి: 16 | సంచిక: 349 | కరీంనగర్ | శనివారం 9 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00







### బెంగాల్ రాజకీయాల్లో

# బిజెపి శకం



- రాష్ట్ర సిఎంగా సువేందు అధికారి
- శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ
- నేడు సిఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం
- ప్రధాని మోడీ, అమిత్ షా, తదితర దిగ్గజాల హాజరు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

కోల్‌కతా, మే 8 : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమాచారం. తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో

11 లో



### దేశం గర్వించేలా

# కొడంగల్ అభివృద్ధి

- కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా
- 430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- మహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం
- కొండంగల్‌లో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపనలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కొడంగల్, మే 8 : దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో

11 లో



# మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

- మూసీతో నగరరూపు రేఖలు మారుతాయి - స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుంది - అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం - ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయండి - జనంలో విశ్వసనీయత కల్పించేలా కార్యాచరణ- ఉన్న నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ - కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో డిప్యూటి సిఎం భట్టి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 8 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తిస్థాయి విశ్వసనీయత

11 లో

### దేశమంతా కాంగ్రెస్

# దరిద్రాన్ని వదిలించుకుంది

- తెలంగాణ మాత్రం నెత్తిన పెట్టుకుంది
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 8 : దేశమంతా కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ దరిద్రాన్ని నెత్తిపై రుద్దుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు ఆగమవుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో నోటిఫికేషన్లు లేవని తెలిపారు. మేమేం తప్పు చేశామని అరెస్టు చేస్తారని కేటీఆర్

11 లో



# మూసీ తొలిదశ పనులకు 7,055 కోట్లు

- తొలిదశలో హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్
- తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశం
- ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా నిధులు
- కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో నిర్ణయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే8 : మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును మొత్తం 55 కిలోమీటర్ల మేర 5 దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఫేజ్-1కు 7,055 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల కోసం సాంకేతిక, ఆర్థిక చర్చలు పూర్తి అయ్యాయి. ప్రజా భవన్‌లో మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రజల భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అలైన్‌మెంట్ మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేబినెట్

11 లో

### తెలంగాణకు కేంద్ర సహకారంపై

# చర్చకు సిద్దం

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు విమర్శలు మానితే మంచిది
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 8 : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా

11 లో

# తమిళనాడు ఉత్కంఠకు తెర

- నేడు సిఎంగా విజయ్ ప్రమాణం - మద్దతుల లేఖలతో గవర్నరర్తో మరోమారు భేటీ - ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌కు గవర్నర్ అనుమతి -11 గంటలకు నెహ్రూ స్టేడియంలో ప్రమాణ కార్యక్రమం -కాంగ్రెస్, లెఫ్ట్ తదితర పార్టీల మద్దతు లేఖలు సమర్పణ -టివికె కూటమి బలం 120కి చేరిక..మద్దతుపై అనేక మెలికలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

చెన్నై, మే 8 : తమిళనాట ఉత్కంఠకు తెరపడింది. టివికె అధినేత విజయ్ నేడు సిఎంగా ప్రమాణం చేయబోతున్నారు. వివిధ పార్టీల మద్దతు లేఖలు గవర్నర్‌కు సమర్పించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. తమిళనాడులో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు

11 లో

# ప్రాణహితపై ప్రధానికి వివరించండి

- వికసిత భారత్‌లో ప్రాజెక్టును పరిశీలించండి
- బిజెపి ప్రజాప్రతినిధులు మోడీకి వివరించాలి
- ప్రాజెక్టుకు కేంద్రం సంపూర్ణ సహకారం ఇవ్వాలి
- తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కొమురం భీం (ఆసిఫాబాద్) మే 8 : ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. నీటి లభ్యతపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. నాటు పడవలపై నదీ ప్రవాహాన్ని మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, వికసిత్ భారత్ అని చెప్పుకునే కేంద్రం ఈ ప్రాజెక్టు విషయంలో పెద్ద మనసు చాటుకోవాలని కోరారు. బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఒక్క యూనిట్ కరెంటు కూడా ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని తరలించే ఈ బృహత్తర కార్యాన్ని పూర్తి చేస్తామని, ఈ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకుని సహకరించాలని మంత్రి జూపల్లి కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మూడు జిల్లాలకు సాగు నీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని అన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలకు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఎల్లుండి(మే 10) తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ పెద్దమనసుతో ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

- నరగంలో వరుస హత్యలు ఆందోళనకరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే 8 : రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.


11 లో

### కేంద్రం నిధులతోనే

# తెలంగాణ బండి నడుస్తోంది

- మోడీ సభను ప్రజలు విజయవంతం చేయాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, మే 8 : తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి మోదీ ప్రభుత్వం రూ. వేల కోట్ల నిధులు ఇస్తుందని కేంద్రం హోం శాఖ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆ నిధులతోనే తెలంగాణ అంతో ఇంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకుంటే తెలంగాణ అభివృద్ధి చెందే అవకాశమే లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోఆయన మీడియాతో మాట్లాడారు. దేశ రాజధాని నుంచి తాము నిధులు తెస్తుంటే.. కాంగ్రెస్ వాళ్లు తెలంగాణ సొమ్మును ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని

11 లో

# కౌశిక్ రెడ్డిపై దాడికి నిరసనగా బిఆర్ఎస్ నాయకులు ధర్నా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 08 : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని బీజేపీ, కాంగ్రెస్ గుండాలు దాడులకు తెగబడుతున్నారంటూ మేడిపల్లి మండల బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడిని నిరసిస్తూ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాల మేరకు శుక్రవారం మేడిపల్లి మండల కేంద్రంలో భారీ ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించారు. బీజేపీ గుండాలారా ఖబర్దార్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బీజేపీ గుండాలు ప్రాణహాని కలిగించేలా దాడి చేశారని నేతలు ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై బీఆర్ఎస్ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని, శాంతి భద్రతలు అదుపు తప్పాయని విమర్శించారు. కరీంనగర్ పట్టణం నడిబొడ్డున తుపాకులతో దొంగతనాలు జరుగుతున్నా కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే స్థాయి నేతలకు కూడా రక్షణ లేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, అభివృద్ధిపై రాజకీయ చర్చలు జరగాలి కానీ ఇలాంటి భౌతిక దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి చేటు అని హెచ్చరించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనం, క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడికి బాధ్యత వహిస్తూ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ నాయకురాలు పావని గౌడ్ పై దాడికి ప్రయత్నించిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సర్పంచి మకిలి దాసు, ఉప సర్పంచ్ తోపారపు అర్జున్, బిఆర్ఎస్ పార్టీ మేడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు దేశవేని కృష్ణ, ఆర్మూర్ హరీష్, మోతే చారి బాబు, ఎండి అన్సర్, తోపారపు నవీన్, కేతవేణి మనోజ్, కేతవేణి, మహేందర్, మోతే జంపి, సురుకంటి రవీందర్ రెడ్డి, గోపి, నీలం నవీన్, శివ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి**

**- జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 08 : వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, తూకం వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. జిల్లాలోని జగిత్యాల మండలం చల్ గల్, వేడిపెల్లి మండలం పోరుమల్ల గ్రామంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ..కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి, మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో, జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్ఫలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్ఫాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలు ఉన్నందున ఉరుములు, మెరుపులతో కూడుకున్న వర్షాలు కురిస్తే రైతులు చెట్ల కింద, కరెంటు పోల్స్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పరిశీలనలో మండల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

**- గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు, రవాణా వాహనాలు అందుబాటులో ఉంచాలి - రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ వేగంగా పూర్తి చేసి ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**- జిల్లాలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, మే 08 : జిల్లాలో జరుగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కాల్వ శ్రీరాంపూర్, కూనారం, ఓదెల, పొత్కపల్లి, సుల్తానాబాద్ మండలంలోని రేగడి మద్దికుంట గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అలాగే సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలోని జై హనుమాన్ రైస్ మిల్, సాంబశివ రైస్ మిల్, పూసాల గ్రామంలోని కనక మహాలక్ష్మి రైస్ మిల్, సుగ్లాంపల్లి గ్రామంలోని లక్ష్మీ భవాని రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసి ఆలస్యం లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలని సూచించారు. రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం స్వీకరించాలని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి శ్రీనాథ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయండి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెబ్బేరు, మే 8 : ఈ నెల 10వ తేదీ ఆదివారం దేశ ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, హిందూ నాయకులు, మోడీ అభిమానులకు పిలుపునిచ్చారు. పెబ్బేరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, మూడు రాష్ట్రాల్లో బీజేపీ సాధించిన విజయంతో దేశవ్యాప్తంగా పార్టీకి ప్రజాదారణ పెరిగిందన్నారు. తెలంగాణలో రాజకీయ మార్పులకు ఈ సభ నాంది పలుకుతుందని, వచ్చే ప్రభుత్వం బీజేపీదేనని ధీమా వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆమె వెంటనే రాజీనామా చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ వ్యతిరేక ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ నాయకత్వంలో తెలంగాణకు వేల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు వచ్చాయని నాయకులు గుర్తుచేశారు. ముఖ్యంగా జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజలు మోడీకి బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. మోడీ సభకు వనపర్తి జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, రైలు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హేమారెడ్డి, జిల్లా నాయకులు కంచె ఆంజనేయులు, రాఘవేందర్ గౌడ్, రామకృష్ణ, శివ, టౌన్ అధ్యక్షుడు క్రాంతి కుమార్, సర్వేష్, గౌనెల అరవింద్, కార్తీక్, మోతే రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెతోనే సింగరేణి సమస్యల పరిష్కారం

**- పాత వీఆర్ఎస్ స్కీమ్ పునరుద్ధరించాలి - హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మే 08 : సమ్మె చేస్తే తప్ప సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం కావని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ యూనియన్ ఉపాధ్యక్షులు ఆరెల్లి పోషంతో కలిసి ఆయన మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలపై తీవ్ర విమర్శలు చేసారు. 1998కి ముందు వీఆర్ఎస్ ఉన్న కాలంలో పీఎంఈతో సులభంగా లభించే డిపెండెంట్ల ఉద్యోగాలను మెడికల్ బోర్డు పేరిట కాంప్లికేటేడ్ చేసింది ప్రభుత్వ భాగస్వామ్య గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలేనని ఆయన ఆరోపించారు. కారుణ్య నియామకాల పేరుతో కార్మికులు దోపిడికి గురైతే.. పైరవీకారులు కోట్లకు పడగలెత్తారన్నారు. గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డ్ నిర్వహించక పోయినా కార్మికుల సమస్యలు, సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నోరు మెదపడం లేదని విమర్శించారు. కలిసొచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మె నోటీస్ ఇస్తామన్న ఏఐటీయూసీ.. సీ,ఎండి ని కలుస్తామని, డైరెక్టర్ తో మాట్లాడతామని దాట వేస్తోందని పేర్కొన్నారు. ఓసీ-5 ఓపెన్ కాస్ట్ కావడం మూలంగానే ఓవర్ బర్డెన్ డంప్ చేయడంతో టూ ఇంక్లైన్ లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. షాఫ్ట్ పెట్టి గనుల జీవిత కాలం పెంచవచ్చన్నారు. ఆర్జీ-1 జీఎం కార్యాలయం చేపల మార్కెట్ లా తయారైందని, క్వార్టర్ల అలాట్ మెంట్ లో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణి స్థలం దురాక్రమణకు గురవుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. పాత వీఆర్ఎస్ స్కీమ్ ను పునరుద్ధరించాలని, షాఫ్ట్ తో గనుల జీవితకాలం పెంచాలని, కోల్ ఇండియాలో మాదిరిగా సింగరేణిలో కార్మికులకు ఇన్కం టాక్స్ రీ ఎంబర్స్ మెంట్ ఇవ్వాలని, రకరకాల కారణాలతో పెండింగ్ లో ఉంచిన వెయ్యి మంది డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో కలిసొచ్చే కార్మిక సంఘాలతో కలిసి సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు పల్లె క్రాంతి, దబ్బెట సతీష్, రాంచందర్ రావు, రఫీ, రాంచందర్, రాజన్న, సంతోష్, కుమార్, మురళీధర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# తలసేమియా దినోత్సవం సందర్భంగా? రక్తదాన శిబిరం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్ మే 08: ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్జీ-1 జియం లలిత్ కుమార్ ఆదేశాల మేరకు గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్ లో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీఎంఓ డాక్టర్ బి.అంబిక మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న రోగులకు రక్తం ఎంతో అవసరమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా పునర్జన్మ నిచ్చిన వారవుతారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో జివిటిసి మేనేజర్ పి.మాధవ రెడ్డి, డిప్యూటీ ఎస్ఈ (ఈ అండ్ ఎం) ఎం.వేణుగోపాల్, డాక్టర్ ప్రసన్న కుమార్ పాల్గొని రక్తదాతలను అభినందించారు. రక్తదానం పట్ల యువత, కార్మికులు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్, ఆసుపత్రి వైద్య బృందం, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చివరి ధాన్యపు గింజ వరకు కొంటాం

**- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సమస్య లేకుండా చూడాలి**

**- నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవు - వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే 8 : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను చివరి దాన్యపు గింజ వరకు కొంటామని రైతులు ఎక్కడ అధైర్య పడాల్సిన అవసరం లేదని వనపర్తి శాసనసభ్యులుహొ తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో ఫీూ (రైతు ఉత్పత్తిదారుల సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సమైక్య, ్రూజూ, మెప్మా, ల తోహొ పాటుహొ ఫీూ లను సైతంహొ ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో వీరాయపల్లిలో వారి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రక్రియహొ నిరంతరాయంగా కొనసాగుతుందని ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కొనుగోలు నిరంతరాయంగా కొనసాగుతున్న వలన అక్కడక్కడ లారీలు, గన్ని బస్తాల సమస్యహొ ఉన్న అధికారులు వెంటనే పరిష్కరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారులు ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపైహొ కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అన్నదాతలు ఎలాంటి ఆందోళనలకు గురికాకూడదనీ మీరు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ప్రతి ప్రతి ధాన్యపు గింజలు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులుహొ రాజప్రకాష్ రెడ్డి, వనపర్తి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి. డైరెక్టర్లు వెంకటయ్య, వెంకటరామిరెడ్డి, బాల్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీహొ జిల్లా నాయకులు సత్యారెడ్డి మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, సర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు, నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పుల్లాయిగూడెం నూతన రామాలయ మహోత్సవంలో వనమా రాఘవేందర్

**- ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




భద్రాద్రి-కొత్తగూడెం, మే 8 : భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలోని పుల్లాయిగూడెం గ్రామంలో నూతన రామాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట మరియు ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ మహోత్సవానికి బీఆర్ఎస్ నాయకుడు వనమా రాఘవేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ముందుగా పాత పాల్వంచలోని వనమా రాఘవేందర్ నివాసానికి వెళ్లి మహోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఆహ్వానం మేరకు ఆయన ఆలయ కార్యక్రమంలో పాల్గొని రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వనమా రాఘవేందర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇంతటి ఆధ్యాత్మిక మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. శ్రీరాముడి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కనగాల బాలకృష్ణ, పాత పాల్వంచ ఇంచార్జ్ ముత్యాల ప్రవీణ్, మండల మాజీ అధ్యక్షుడు పూసల విశ్వనాథ్, పాల్గొన్నారు.

# సెన్సస్-2027 నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**- పొరపాట్లు లేకుండా జనగణన ప్రక్రియ పూర్తి చేయాలి - డీసీఓ భారతి హోళీకేరి- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 8 : సెన్సస్-2027 కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎటువంటి లోపాలు లేకుండా జనగణన ప్రక్రియను పూర్తి చేయాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ (డీసీఓ) భారతి హోళీకేరి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఛార్జ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఓ భారతి హోళీకేరి మాట్లాడుతూ, సెన్సస్-2027 దేశ ప్రణాళికా రూపకల్పనకు అత్యంత కీలకమని తెలిపారు. జనగణనకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. డేటా నమోదు సమయంలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాంకేతిక సహాయం అవసరమైన వారికి తగిన సహకారం అందించాలని తెలిపారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి వారికి సమగ్ర శిక్షణ అందించాలని ఆదేశించారు. సెన్సస్‌కు అవసరమైన మాన్యువల్స్, సూపర్వైజర్ కిట్లు, మ్యాపులు తదితర సామగ్రి పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అదనపు రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో సెన్సస్--2027 ఏర్పాట్లను విస్తృత స్థాయిలో చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల ఎంపిక, శిక్షణ కార్యక్రమాలు, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

# తలసేమియా బాధితులకు రక్తదానంలో పూర్తి సహకారం

## ప్రపంచ తలసేమియా దినోత్సవంలో ఏసీపీ రమణమూర్తి, ఐఎంఏ అధ్యక్షురాలు రెహానాబేగం హామీ




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 8 : "తలసేమియా బాధిత చిన్నారులకు సమయానికి రక్తం అందించడం అత్యంత ముఖ్యమైన విషయం. రక్తదాన కార్యక్రమాలకు మా పూర్తి సహకారం ఉంటుంది" అని ఏసీపీ రమణమూర్తి, ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహానాబేగం తెలిపారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏసీపీ రమణమూర్తి మాట్లాడుతూ, సంకల్ప స్వచ్ఛంద సంస్థతో తనకు ప్రత్యేక అనుబంధం ఉ ందన్నారు. తలసేమియా చిన్నారుల కోసం పలుమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించామని గుర్తుచేసి, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు పోలీస్ శాఖ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహానాబేగం మాట్లాడుతూ, తలసేమియా చిన్నారులు ఆరోగ్యంగా ఉండి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రక్తదానంతో పాటు అవసరమైన ప్రతి అంశంలో తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు. తలసేమియా జన్యుపరమైన వ్యాధి కావడంతో గర్భిణీలు తప్పనిసరిగా రొటీన్ హిమోగ్లోబిన్, ఎలక్ట్రోఫోరోసిస్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వివాహానికి ముందు కూడా హెచ్‌బిఏ2 స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధి నివారణకు అవకాశం ఉంటుందని వివరించారు. ఏఆర్ ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ, తలసేమియా చిన్నారులను సాధారణ పిల్లల మాదిరిగానే చూడాలని, వారికి అవసరమైన మందులు, రక్తం అందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడానికి తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు.

పిల్లలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన "వివాహానికి ముందు హెచ్‌బిఏ2 టెస్ట్" అనే అవగాహన స్కిట్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తలసేమియా చిన్నారులకు రక్తదానం, చికిత్సల కోసం ఆర్థిక సహాయం అందించిన దాతలను సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తలసేమియా రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంస్థతో కలిసి పని చేస్తామని టీఎంసీ జి.సుజాత రాణి తెలిపారు. సంస్థ ఫౌండర్ ప్రొద్దుటూరి అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణమూర్తి, సతీష్ నారాయణ చౌదరి, మానస, బీవీఎన్ కృష్ణ, నరేష్, లక్ష్మీదీపా, శ్రావణి, మెప్మా ఖమ్మం సీవో ద్రౌపది, సంస్థ బాధ్యులు పి.పావని, పి.రవిచందర్, పి.ఉదయ్ భాస్కర్, పి.వంశీ కిరిటీ, పి.ప్రియ, అనురాధ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో విశేష సేవలు అందించిన... బాంబు డిస్పోజల్ బృందానికి ఎస్పీ రోహిత్ రాజు అభినందనలు

## - ఐఈడీల నిర్వీర్యంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన
## - సిబ్బందికి ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేత.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి–కొత్తగూడెం, మే 8 : మావోయిస్టు ప్రభావిత అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలతో కలిసి నిర్వహించిన సంయుక్త సెర్చ్ ఆపరేషన్లలో విశేష ప్రతిభ కనబరిచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాంబు డిస్పోజల్ (బీడీ) బృందం సభ్యులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. సెర్చ్ ఆపరేషన్ల సందర్భంగా మావోయిస్టులకు చెందిన ఆరు డంప్‌లను, ఐదు ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో బీడీ బృందం కీలక పాత్ర పోషించిందని ఎస్పీ తెలిపారు. అలాగే భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు ఏర్పాటు చేసిన 10 ఐఈడీలను గుర్తించి, అత్యంత చాకచక్యంగా నిర్వీర్యం చేయడం బృందం సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలకు నిదర్శనమని కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వర్తించిన బాంబు డిస్పోజల్ బృందం సేవలు గర్వకారణమని పేర్కొన్న ఎస్పీ రోహిత్ రాజు, అటవీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించే సమయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే నిర్ణీత భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ స్వీయ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచనలు చేశారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన 12 మంది బీడీ టీం పోలీస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆపరేషన్స్ రవి, బాంబు డిస్పోజల్ బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈవోలు శ్రీమతి ప్రశాంతి, శ్రీ శివప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సమీకృత గురుకులాల నిర్మాణ పనులు గడువులోపు పూర్తి చేయాలి

## - లక్ష్మీపురంలో అత్యాధునిక వసతులతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం
## - విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పించేలా సదుపాయాలు: కలెక్టర్ దివాకర్ టీఎస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 8 : పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను ప్రభుత్వం నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధిర నియోజకవర్గ పరిధిలో పర్యటించిన కలెక్టర్, బోనకల్ మండలం లక్ష్మీపురంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తూ భవనాల నమూనా మ్యాపులను పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాల వద్ద లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించేలా అన్ని అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మధిర నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పోటీ ప్రపంచానికి తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఆధునిక వసతులతో విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు భవిష్యత్తులో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని తెలిపారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం నాణ్యమైన నిర్మాణ పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఖమ్మం జిల్లా పరిధిలో ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు అనుమతులు లభించాయని, నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో పనులు పురోగమిస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, బోనకల్ తహసీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ కుల దురహంకార హత్య అత్యంత కిరాతకం

## - నిందితులను కఠినంగా శిక్షించాలి
## - సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, మే 8 : సికింద్రాబాద్‌లో చోటుచేసుకున్న కుల దురహంకార హత్యను సీపీఐ(ఎం) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బందు సాయిలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులాంతర వివాహానికి సిద్ధమైనందుకు బీటెక్ విద్యార్థి యావన్‌ను దుండగులు అత్యంత దారుణంగా హత్య చేయడం సభ్య సమాజాన్ని కలచివేసే ఘటన అని పేర్కొన్నారు. సీతాఫల్‌మండిలో జరిగిన ఈ ఘటనపై స్పందించిన బందు సాయిలు, జిల్లా కమిటీ తరఫున బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పక్కా ప్రణాళికతో గత రెండు నెలలుగా రెక్కీ నిర్వహించి, పాత వాహనాలు, సిమ్ కార్డులు సేకరించి ఈ ఘాతుకానికి పాల్పడడం దుర్మార్గమని విమర్శించారు. కులం, మతం పేరుతో జరుగుతున్న ఇటువంటి కుల దురహంకార హత్యలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలకు రక్షణ కల్పించడంతో పాటు సమాజంలో అవగాహన, చైతన్యం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నగర నడిబొడ్డున ఇలాంటి దాడులు జరగడం అత్యంత శోచనీయమని పేర్కొన్న ఆయన, ఘటనకు బాధ్యులైన నిందితులందరినీ వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ(ఎం) తరఫున కోరారు.

# పెళ్లిరోజున సేవా స్ఫూర్తి

## - ఉపాధి కూలీల దాహార్తి తీర్చిన లత-శ్రీనివాస్ గౌడ్ దంపతులు
## - మజ్జిగ ప్యాకెట్ల పంపిణీతో కూలీల ప్రశంసలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 8 : ఈ రోజుల్లో చాలా మంది తమ వివాహ వార్షికోత్సవాలను కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఘనంగా జరుపుకుంటుంటే, మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి లత–శ్రీనివాస్ గౌడ్ దంపతులు మాత్రం సేవా కార్యక్రమంతో తమ పెళ్లిరోజును శుక్రవారం ప్రత్యేకంగా నిలిపారు. మండుతున్న ఎండల్లో ఉపాధి హామీ పనుల్లో శ్రమిస్తున్న కూలీల దాహార్తిని తీర్చేందుకు వారు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

గ్రామ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లిన దంపతులు అక్కడ పనిచేస్తున్న సుమారు 50 మంది కూలీలకు చల్లని మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఇటీవల మండలంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, మజ్జిగ పంపిణీ వారికి ఉపశమనం కలిగించింది. కూలీలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లత–శ్రీనివాస్ గౌడ్ దంపతులు మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే విధంగా తమ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోవాలని భావించామని చెప్పారు. ఎండల్లో కష్టపడుతున్న కూలీలకు కొంతైనా ఊరటనివ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి కూలీలు మాట్లాడుతూ, తమ ప్రత్యేక రోజున తమను గుర్తు చేసుకుని మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎండ వేళలో చల్లని మజ్జిగ అందించడం ఎంతో ఉపశమనం కలిగించిందని పేర్కొన్నారు. లత–శ్రీనివాస్ గౌడ్ దంపతులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు కూడా ఈ సేవా కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, ప్రతి ఒక్కరూ తమ ప్రత్యేక సందర్భాలను సమాజానికి ఉపయోగపడేలా జరుపుకుంటే మంచి సందేశం సమాజానికి చేరుతుందని అభిప్రాయపడ్డారు.



# అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం

## - రైతులకు పూర్తి మద్దతు ధర అందేలా చర్యలు
## - మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 8 : అకాల వర్షాల కారణంగా తడిసిన వరి ధాన్యాన్ని కూడా ప్రభుత్వం పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని కాటారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల తెలిపారు. శుక్రవారం మహాదేవపూర్, కాటారం, రేగులగూడెం, గంగారం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు పరిస్థితులు, ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన దేవేందర్ రెడ్డి, పాగే సురేష్, మారపాక రాజు, సత్తి రెడ్డి, ఏఎంసీ మరియు పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లాల నుండి ధాన్యం, మక్కలను త్వరిత గతిన మిల్లులకు తరలించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 8 : కల్లాల నుండి ధాన్యం, మక్కలను త్వరిత గతిన మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిట్యాల మండలం దూత్ పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని లారీ ల పైనే ఆధార పడకుండా అధికారులు కొద్ది మొత్తం ఉంటే ట్రాక్టర్ ల ద్వారా మ్యాపింగ్ చేసిన మిల్లుకు తరలించాలని తెలిపారు. వాతావరణ సూచనల ప్రకారం కల్లాలలో గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉ ంచాలని ఆదేశించారు. అనంతరం చిట్యాల మండల శివారులోని బాల మురుగన్ పత్తి మిల్లును పరిశీలించి మక్కలు నిల్వ చేసుకునే విధానం పరిశీలించి వే బ్రిడ్జిని తనిఖీ చేశారు. ఓ పి ఎం ఎస్ లో నమోదు ఎంటర్ అవడం లేదన్న సమస్యను రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్తి మిల్లు లో నిల్వ చేసే మక్కలను వర్షానికి తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొన్ని చోట్ల ఆన్లైన్ లో మక్క రైతుల వివరాలు ఓపిఎంఎస్ చూపించడం లేదని రైతులు జిల్లా కలెక్టర్ కు తెలుపగా వ్యవసాయ శాఖ అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రాప్ బుకింగ్ సక్రమంగా జరగక పోతే రైతులు ఇబ్బందులు పడవలసి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి మక్కా రైతుల పంట వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. మక్కలు అమ్ముకునే రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. చిట్యాల మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ను తనికి చేసిన కలెక్టర్ కొనుగోలు చేసిన మక్కల బస్తాల బరువును కాంటా వేసి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మక్కల రైతులు తమ స్వంత ఖర్చులతో మక్కలను గోదాములకు తరలిస్తే ప్రభుత్వం గన్ని సంచుల ఖర్చు, రవాణా ఖర్చు అందిస్తుందని తెలిపారు. మార్క్ ఫెడ్ అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని కల్లాలలోని ప్రతి దాన్య గింజ మిల్లులకు తరలించే వరకు కృషి చేయాలని సూచించారు. సిగ్నల్ సమస్య వల్ల ఆన్లైన్ లో నమోదు కావడం లేదని తెలిసి కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మొగుళ్ళ పల్లి మండల కేంద్రంలోని ఆధునిక వ్యవసాయ గిడ్డంగిని పరిశీలించి నిల్వల వివరాలు గిడ్డంగి విస్తీర్ణం అడిగి తెలుసుకన్నారు. రేగొండ మండలం రూపిరెడ్డి పల్లిలో గల సహకార సంఘం భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఎస్ఓ కిరణ్ కుమార్, సహకార అధికారి వాలియ నాయక్, వ్యవసాయ అధికారి బాబురావు, మార్క్ ఫెడ్ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# రేపు తిరుమలాయపాలెంలో 'ప్రజా దర్బార్'

## ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 7: పాలేరు నియోజకవర్గ ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహిస్తున్న 'ప్రజా దర్బార్' కార్యక్రమం శనివారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజల వినతులు స్వీకరించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. భూ సంబంధిత సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, గృహజ్యోతి పథకం తదితర ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను మంత్రి స్వయంగా పరిశీలించనున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు వేదికపైనే అందుబాటులో ఉండి, అర్హుల సమస్యలను తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. ఈ ప్రజా దర్బార్‌కు తిరుమలాయపాలెం క్లస్టర్ పరిధిలోని తిరుమలాయపాలెం, బాలాజీనగర్ తండా, వెదుళ్ళచెర్వు, కేశవాపురం, పిండిప్రోలు, ఎర్రగడ్డ, కొక్కిరేణి, తాళ్ళచెరువు, తిమ్మక్కపేట, అజ్మీర తండా, దమ్మాయిగూడెం, తెట్టెలపాడు, తిప్పారెడ్డిగూడెం, పడమటి తండా, హైదర్‌సాయిపేట గ్రామాల ప్రజలు హాజరుకావాలని అధికారులు సూచించారు.

# రైతులు, మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## కొడవటంచలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రేగొండ, మే 8: రైతులు, పాడి పశువుల పెంపకదారులు, మత్స్యకారుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజాపాలన––ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, నీటిపారుదల శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పశుసంవర్ధక చికిత్స అవగాహన శిబిరం, రైతు వారోత్సవం, రైతు వారం కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స అందిస్తున్నామని, మేలు జాతి దూడల పెంపకం కోసం లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భాధానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. మత్స్యకారుల అభివృద్ధిలో భాగంగా చెరువుల్లో కలుపు నివారణ, చేపల వ్యాధుల నిర్వహణ, చేపల ఉత్పత్తి పెంపు చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే రైతు వారం కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల గేట్ల నిర్వహణ, ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులు, కాలువల్లో పూడిక తొలగింపు, జమ్ము కంపచెట్ల తొలగింపు వంటి పనులను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, కొడవటంచ ఆలయ కమిటీ చైర్మన్ నాయినేని సంపత్ రావు, ప్రజాప్రతినిధులు, రైతులు, మత్స్యకారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## మ్యాజిక్ ఫిగర్ లేకపోవడం గవర్నర్ తప్పా ?

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, చట్టాలు, శాసనసభ, లోక్‌సభ అంటే తెలియని వారంతా..ఇప్పుడు చట్టసభలకు ఎన్నికవుతున్నారు. భారత ప్రజాస్వామ్యంలో ఉన్న వెసలుబాటు కారణంగా ఎవ్వరైనా చట్టసభలకు ఎన్నిక కావచ్చు. ఎన్నికయ్యాక అయినా చట్టాలు, రాజ్యాంగ గురించి తెలుసుకుంటే బాగుండేది. కానీ అలా జరగడం లేదు. డబ్బులు, పలుకుబడి, మందబలం ఉంటే ప్రజాప్రతినిధులు అవుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఏమీ తెలియకండా బయట ఉండేవారు చట్టాల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడేస్తున్నారు. తమిళనాడు విషయంలో ఇదే జరుగుతోంది. టివికె పార్టీ పార్టీ పెట్టి,108 సీట్లు నెగ్గి, అత్యధిక మెజార్టీ సీట్లతో విజయ్ ముందున్నారు. ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 118 సీట్లు ఉండాలి. కేవలం అందరికన్నా మెజార్టీ సాధిస్తే లేదా అతిపెద్ద పార్టీగా అవతరిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రూల్ ఏమీ లేదు. 118 సీట్లకు సంబంధించి మద్దతు పత్రాలను సమర్పించాలని గవర్నర్ విశ్వనాథ్ కర్లేకర్ కోరడంలో కూడా వింతేమీ లేదు. మద్దతు ఉందని తెలిస్తే తప్పకుండా ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాల్సిందే. అలా కాకుండా అతిపెద్ద పార్టీగా గెలిచాం కనుక ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలని గవర్నర్‌ను డిమాండ్ చేయడం సరికాదు. అలాగే గవర్నర్‌ను నిందించడం అంతకన్నా సరికాదు. అందుకే చట్టం, రాజ్యాగం తెలియని నటులు ప్రకాశ్ రాజ్, విశాల్, కాంగ్రెస్ నేతలు గవర్నర్ తీరును తప్పు పడుతున్నారు. వీరంతా బిజెపి వ్యతిరేకులు కనుక గవర్నర్‌ను తప్పు పడుతున్నారు. గతంలో అనేక రాష్ట్రాల్లో ఇలా మద్దతు ఉన్నా లేకున్నా ప్రభుత్వాల ఏర్పాటుకు పిలిచి, బొక్కబోర్లా పడ్డ సంఘటనలు ఉన్నాయి. అలాగే హార్స్ ట్రేడింగ్ జరగడం చూశాం. కాబట్టి గవర్నర్ అనుసరించిన విధానమే రాజ్యాంగబద్ధం. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చి ఐదు రోజులు కావస్తున్నా.. వ్యవహారం ముందుకు కదలడం లేదు. టివికె అధినేత విజయ్‌కు మద్దతు ఇచ్చే వారు లేఖలు సమర్పించి ఉంటే ఈ పంచాయి తీ రాదు. తమిళనాడు రాజకీయం రసకందాయంలో పడడానికి హంగ్ ఏర్పడడమే ప్రధాన కారణం. అలాగే గట్టిగా ఏ ఒక్క పార్టీ కూడా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించలేదు. ఐదు సీట్లు కాంగ్రెస్ మాత్రమే ప్రకటించింది. అదికూడా మద్దతు లేఖ సమర్పించలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీ, కూటమికి మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన ఏర్పడింది. దీనికి గవర్నర్ తప్పు కాదు.ఆయన బిజెపి మనిషి కనుక ఇలా చేశారని అనేవాళ్లు మూర్ఖులు తప్ప మరొకరు కాదు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో సినీ హీరో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాల్లో గెలిచి మెజారిటీకి కాస్తా దూరంలో నిలిచి పోయారు. స్టాలిన్ నాయకత్వం లోని డీఎంకే కూటమి 73 స్థానాలకు పరిమితం కాగా, పళనిస్వామి నేతృత్వంలోని అన్నా డీఎంకే కూటమి 53 స్థానాలు గెలుచుకున్నది. ఈ మూడింటిలో ఏవో రెండు పార్టీలు కలిస్తే తప్ప ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం లేదు. ఎవరికి వారే భీష్మించుకొని కూర్చోవడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ఆగిపోయింది. గవర్నర్‌ను విజయ్ సంప్రదించినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించా లంటే మ్యాజిక్ ఫిగర్ సభ్యుల మద్దతు తప్పనిసరి అని గవర్నర్ స్పష్టంచేశారు. దీంతో తమిళనాడులో సీఎం పీఠం ఎవరిది అనే తీవ్ర ఉత్కంఠ దేశవ్యాప్తంగా నెలకొన్నది. బీహార్‌లో 2005 ఎన్నికల్లో జేడీయూ, ఆర్జేడీ, ఎల్‌జేపీలో ఏ పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో అక్కడ ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన నెలకొన్నది. తాము ఎవరికీ మద్దతిచ్చేది లేదని మూడు పార్టీల నేతలు భీష్మించుకున్నారు. విధి లేని పరిస్థితుల్లో గవర్నర్ బూటాసింగ్ రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేశారు. అసెంబ్లీ రద్దు చేశారు. వ్యవహారం కోర్టు దాకా వెళ్లింది. ప్రతిష్టంభన పేరుతో అసెంబ్లీని రద్దు చేయడం అప్రజాస్వామికమని సుప్రీంకోర్టు తప్పుపట్టింది కానీ అప్పటికే రద్దయిన అసెంబ్లీ పునరుద్ధరించలేదు. ఆరునెలలకే అసెంబ్లీ ఎన్నికలు జరిగి జేడీయూ అధికారంలోకి వచ్చింది. సర్కారియా కమిషన్ సిఫారసుల ప్రకారం గవర్నర్ తొలుత మెజారిటీ సాధించిన పార్టీకి లేదా ప్రీపోల్ సంకీర్ణానికి అవకాశం ఇవ్వాలి. లేదా ఎన్నికల తర్వాత ఏర్పడ్డ సంకీర్ణానికి అవకాశం ఇచ్చి బలపరీక్షకు పురమాయిం చాలి. సర్వసాధారణంగా జరుగుతున్న తంతు ఇదే. ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాని సందర్భంలో అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆహ్వానించ వచ్చునా లేదా అన్న విషయంలో మాత్రం గవర్నర్లు ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. అలా తీసుకున్న సందర్భం లో విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. ఇలా గోవా, కర్నాటక, మహారాష్ట్రల్లో తలబొప్పి కట్టిన సంఘటనలు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 నిబంధన ప్రకారం ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహాపై ఇతర మంత్రులను నియమిస్తారు. గవర్నర్ అభీష్టం ఉన్నంతకాలం వారు పదవిలో ఉంటారు. ఈ మేరకు గవర్నర్‌లు అంతా ఒకే రీతిన వ్యవహరించారు. కానీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడితే ముందుగా ఎవరిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలన్న విషయంలో ఒక విధానం అంటూ లేకుండా పోయింది. అక్కడే గవర్నర్ల విచక్షణాధికారం చట్టాన్ని అపహాస్యం చేసిన సందర్భాలు చూశాం. రాజకీయ నేతలను గవర్నర్లుగా నియమించడం మొదలయ్యాక విచక్షణాధికారం ఆయా పార్టీల విధానాలకు అనుగుణంగా మారింది. ఇలాంటి దుష్ట సంప్రదాయాలను కాంగ్రెస్ పార్టీ మొదలు పెట్టింది. బిజెపి కొనసాగిస్తోంది. అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీని ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలా వద్దా అనే విషయంలో ఒక స్పష్టత ఇస్తే తమిళనాడు వంటి వివాదాలు భవిష్యత్తులో తలెత్తవు. ఆ దిశగా కేంద్రం రాజ్యాంగ సవరణ చేస్తే మరీ మంచిది. డీఎంకే, అన్నాడీఎంకే కూటములు ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రాని నేపథ్యంలో విజయ్‌కి గవర్నర్ అవకాశం ఇస్తే పెద్దగా అభ్యంతరాలు ఎందుకని చాలామంది ప్రశ్నిస్తున్నారు. కానీ ఇక్కడా గవర్నర్ తన పరిధి మేరకు, రాజ్యాంగ బద్దంగానే మద్దతు లేఖలు కోరారు. అందులో తప్పుకూడా లేదు. తన బలాన్ని నిరూపించుకోవడానికి రెండు వారాల సమయం కావాలని అడగడంతోనే అక్కడ మెలిక ఉంది. అధికారంలోకి వచ్చిన తరవాత ఓ పదిమంది ఎమ్మెల్యేలను కొనడం సులువు. అలాంటి ఉదాహరణలు కోకొల్లలు. కాబట్టి హార్స్ ట్రేడింగ్‌కు అవకాశం లేకుండా, నడుచుకోవాలన్న గవర్నర్ నిర్ణయం సమర్థనీయం. అన్నా డీఎంకే, డీఎంకేల్లో ఒకరు మద్దతిస్తే విజయ్ ముఖ్యమంత్రి కావచ్చు. లేదా డీఎంకే, అన్నా డీఎంకే కూటములు కలిస్తే కాంగ్రెస్, బీజేపీ సహకారం లేకపోయినా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగే 121 సీట్ల బలం వారికి ఉన్నది. ఈ క్రమంలో గవర్నర్‌ను విమర్శించే వారు చట్టాలను, రాజ్యాంగాన్ని తెలుసుకుంటే మంచిది. మరీ ముఖ్యంగా సినిమా నటులకు ఇది వర్తిస్తుంది.

# బెంగాల్ రాజకీయ యవనికపై 'కమల' వికాసం

# ఐదు దశాబ్దాల చరిత్రకు ముగింపు నూతన శకానికి నాంది !

## నాడు ఉద్యమ సహచరుడు... నేడు ముఖ్యమంత్రి: శుభేందు అధికారి రాజకీయ ప్రస్థానం - బెంగాల్‌లో కొత్త అధ్యాయం



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

పశ్చిమ బెంగాల్ రాజకీయ యవనికపై శతాబ్దపు మార్పు ఆవిష్కృతమైంది. గంగానది ప్రవాహం తన దిశను మార్చుకున్న చందంగా, దశాబ్దాల తరబడి వామపక్ష భావజాలానికి, ఆపై తృణమూల్ ప్రాంతీయ ఆధిపత్యానికి నిలయమైన బెంగాల్ గడ్డపై ఇప్పుడు కమల వికాసం జరిగింది. 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కేవలం ఒక ప్రభుత్వ మార్పు మాత్రమే కాదు, అది ఒక చారిత్రక విప్లవం, సామాజిక పరివర్తన మరియు రాజకీయ పునరేకీకరణకు నిదర్శనం. 294 స్థానాలు కలిగిన బెంగాల్ శాసనసభలో భారతీయ జనతా పార్టీ 206 స్థానాలతో ప్రభంజనం సృష్టించి, అధికారాన్ని కైవసం చేసుకోవడం జాతీయ రాజకీయాల్లోనే అత్యంత కీలక ఘట్టంగా నిలిచిపోతుంది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ మైదానం సాక్షిగా శుభేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఈ వేళ, బెంగాల్ నూతన శకానికి నాంది ప్రస్తావన చేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వంటి దిగ్గజాల సమక్షంలో జరుగుతున్న ఈ వేడుక, తూర్పు భారతంపై కాషాయ జెండా పట్టును సుస్థిరం చేసింది.

ఈ చారిత్రక పరిణామం వెనుక గడిచిన దశాబ్ద కాలపు రాజకీయ మథనం దాగి ఉంది. 2011లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ 34 ఏళ్ల సుదీర్ఘ వామపక్ష పాలనను అంతమొందించి నప్పుడు, అది బెంగాల్ పునరుజ్జీవనంగా భావించ బడింది. కానీ, కాలక్రమేణా తృణమూల్ పాలనలో చోటుచేసుకున్న అవినీతి ఆరోపణలు, ముఖ్యంగా విద్యాశాఖలో ఉపాధ్యాయ నియామక కుంభకోణాలు మరియు శారదా, నారద వంటి చిట్ ఫండ్ స్కాములు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని నింపాయి. క్షేత్రస్థాయిలో తృణమూల్ కేడర్ సాగించిన 'తోలాబాజీ' (వసూళ్ల పర్వం), సిండికేట్ రాజ్ మరియు హింసాత్మక రాజకీయాలు సామాన్య ఓటరును ఆలోచింప జేశాయి. ముఖ్యంగా సందేశ్‌ఖాలీ వంటి ప్రాంతాల్లో మహిళలపై జరిగిన అకృత్యాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్షాలకు బలమైన ఆయుధాలుగా మారాయి. మమతా బెనర్జీ స్వయంగా తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో పరాజయం పాలవ్వడం, అధికార వ్యతిరేకత ఎంత తీవ్రస్థాయిలో ఉందో స్పష్టం చేస్తోంది.

శుభేందు అధికారి ఎదుగుదల బెంగాల్ రాజకీయాల్లో ఒక ఆసక్తికరమైన మలుపు. నందిగ్రామ్ భూసేకరణ వ్యతిరేక పోరాటంలో మమతా బెనర్జీకి కుడి భుజంగా నిలిచి, తృణమూల్ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించిన ఆయన, అదే పార్టీకి చరమగీతం పాడటం విశేషం. పార్టీలో వారసత్వ రాజకీ యాలు ప్రవేశించడం, అభిషేక్ బెనర్జీకి ప్రాధాన్యత పెరగడం వంటి పరిణామాలతో బయటకు వచ్చిన శుభేందు, బీజేపీలో చేరి అనతి కాలంలోనే ఆ పార్టీకి తిరుగులేని వ్యూహకర్తగా మారారు. 2021లో మమతా బెనర్జీని నందిగ్రామ్ గడ్డపై ఓడించిన క్షణమే ఆయన ముఖ్యమంత్రి రేసులో ముందంజ వేశారు. ఇప్పుడు ప్రజాతీర్పుతో ఆయన పీఠాన్ని అధిష్ఠించడం, బెంగాల్ ప్రజలు ఒక స్థానిక, గట్టి నాయకత్వాన్ని కోరుకున్నారనే దానికి నిదర్శనం. ఆయన రాజకీయ అనుభవం, క్షేత్రస్థాయి కేడర్‌పై పట్టు ఇప్పుడు కొత్త ప్రభుత్వానికి వెన్నెముకగా మారనున్నాయి.

ఈ ఎన్నికల గణాంకాలను విశ్లేషిస్తే, బీజేపీకి లభించిన మెజారిటీ కేవలం మతపరమైన ధ్రువీకరణ వల్ల వచ్చిందని భావిస్తే పొరపాటే అవుతుంది. ఉత్తర బెంగాల్‌లోని రాజ్‌బన్షీలు, దక్షిణ బెంగాల్‌లోని మతువా సామాజిక వర్గం, జంగల్ మహల్ ప్రాంతం లోని గిరిజనులు ఏకపక్షంగా బీజేపీ వైపు మొగ్గు చూపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆవాస్ యోజన', 'ఉజ్వల', 'కిసాన్ సమ్మాన్ నిధి' వంటి పథకాలు క్షేత్రస్థాయిలో పేదలకు చేరడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల ఎంపికలో వివక్ష చూపడం బీజేపీకి కలిసొచ్చింది. అంతేకాకుండా, సరిహద్దు జిల్లాల్లో చొరబాట్ల అంశం, జాతీయ భద్రత మరియు పౌరసత్వ సవరణ చట్టం అమలుపై బీజేపీ ఇచ్చిన స్పష్టత ఆయా వర్గాల్లో నమ్మకాన్ని కలిగించింది. గతంలో కాంగ్రెస్, వామపక్షాలకు పరిమితమైన ఓటు బ్యాంకులు కూడా ఈసారి బీజేపీ వైపు మళ్లడం వల్లనే 206 స్థానాల భారీ మెజారిటీ సాధ్యమైంది.

అయితే, ఈ అధికార మార్పిడి రక్తపాత రహితంగా సాగక పోవడం బెంగాల్ రాజకీయ విషాదం. ఎన్నికల ఫలితాల అనంతరం చెలరేగిన హింస, ప్రతిపక్ష కార్యకర్తలపై దాడులు, ఆస్తి నష్టం వంటివి రాష్ట్రంలో ప్రజాస్వామ్య మూలాలను ప్రశ్నిస్తున్నాయి. మమతా బెనర్జీ ఈ ఓటమిని అంగీకరించక పోవడమే కాకుండా, ఎన్నికల కమిషన్ తీరుపై, ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ న్యాయ పోరాటానికి సిద్ధమవ్వడం రాజకీయ ఉత్కంఠను పెంచుతోంది. బెంగాల్‌లో రాజకీయ హింస అనేది ఒక సంస్కృతిగా మారిపోవడం ఆందోళనకరం. నూతన ముఖ్యమంత్రిగా శుభేందు అధికారి ముందున్న తక్షణ సవాలు ఈ హింసాకాండను అరికట్టి, రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడం. పరిపాలనలో పారదర్శకతను తీసుకువచ్చి, రాజకీయ వేధింపులకు తావులేకుండా ముందుకు సాగితేనే ఈ విజయానికి సార్థకత లభిస్తుంది.

ఆర్థికంగా బెంగాల్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిలో ఉంది. దాదాపు 6 లక్షల కోట్ల రూపాయల అప్పులతో రాష్ట్ర ఖజానా వెలవెలబో తోంది. ఒకప్పుడు పారిశ్రామికంగా దేశానికే దిక్సూచిగా ఉన్న బెంగాల్, నేడు పరిశ్రమల వలసలతో నిరుద్యోగ సమస్యను ఎదుర్కొం టోంది. సింగూరు, నందిగ్రామ్ వంటి పరిణామాలు భారీ పెట్టుబడి దారులను బెంగాల్‌కు దూరం చేశాయి. ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని 'డబుల్ ఇంజిన్' సర్కార్ (కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ) బెంగాల్‌కు కొత్త పెట్టుబడులను తీసుకువస్తుందని, 'సోనార్ బంగ్లా' (బంగారు బెంగాల్) కల నిజమవుతుందని యువత ఆశతో ఉన్నారు. కేంద్రంతో సయోధ్యగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం, పారిశ్రామిక కారిడార్లను



అభివృద్ధి చేయడం శుభేందు ప్రభుత్వ ప్రాధాన్యతలుగా ఉండాలి. ముఖ్యంగా కలకత్తా పోర్ట్ పునరుద్ధరణ, జౌళి రంగం, సమాచార సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాంస్కృతికంగా కూడా ఈ మార్పు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. బెంగాల్ అంటే రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానందల వంటి మహనీయుల పురిటిగడ్డ. బీజేపీ తన ప్రచారంలో 'బెంగాలీ అస్తిత్వాన్ని' హిందూ జాతీయ వాదంతో మేళవించి విజయవంతమైంది. తృణమూల్ కాంగ్రెస్ బీజేపీని 'బయట వ్యక్తుల పార్టీ'గా ముద్ర వేయాలని చూసినా, సుభేందు వంటి స్థానిక నేతలను ముందుంచడం ద్వారా బీజేపీ ఆ విమర్శను తిప్పికొట్టింది. రవీంద్ర జయంతి రోజే ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తాము బెంగాల్ సంస్కృతికి వారసులమే తప్ప విడదీయరాని శక్తులం కాదని చాటిచెప్పే ప్రయత్నం చేస్తోంది. మేధావుల ప్రాబల్యం ఎక్కువగా ఉండే ఈ రాష్ట్రంలో, వారిని కూడా పరిపాలనలో భాగస్వాములను చేయడం ప్రభుత్వానికి అవసరం.

2026 బెంగాల్ ఎన్నికల ఫలితం కేవలం ఒక పార్టీ ఓటమి, మరో పార్టీ గెలుపు కాదు; ఇది బెంగాల్ ఓటరు నాడిలో వచ్చిన మౌలిక మార్పు. ఐదు దశాబ్దాల పాటు కాంగ్రెస్ ఏతర, వామపక్ష మరియు ప్రాంతీయ భావజాలంతో నడిచిన బెంగాల్, ఇప్పుడు జాతీయవాద ప్రధాన స్రవంతిలో చేరింది. ఈ విజయం 2029 లోక్‌సభ ఎన్నికలకు బీజేపీకి పెద్ద ఊపిరినిస్తుంది. అదే సమయంలో, తృణమూల్ కాంగ్రెస్ తన ఉనికిని కాపాడుకోవడానికి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. వారసత్వ రాజకీయాలకు కాలం చెల్లిందని, కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే ఓట్లను రాల్చలేవని, పరిపాలనలో పారదర్శకత, శాంతిభద్రతలు ముఖ్యమని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. శుభేందు అధికారి సారథ్యంలో బెంగాల్ అభివృద్ధి పథంలో పయనిస్తుందా లేక రాజకీయ ఘర్షణల కేంద్రంగానే మిగిలిపోతుందా అనేది రాబోయే కాలమే నిర్ణయిస్తుం ది. ఏది ఏమైనా, భారత రాజకీయ చిత్రపటంలో బెంగాల్ నేడు ఒక నూతన అధ్యాయాన్ని లిఖించిందనేది అక్షర సత్యం.

-వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

# స్వాభిమానం,దేశభక్తి ప్రతీక మహారాణా ప్రతాప్



ఆళవందార్ వేణు మాధవ్
8686051752

భారతదేశ చరిత్రలో స్వాభిమానం, ధైర్యం, దేశభక్తి, స్వాతంత్ర్య సంకల్పానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుల్లో మహారాణా ప్రతాప్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. రాజపుత్ర వీరత్వానికి ప్రతీకగా నిలిచిన ఆయన మొఘల్ చక్రవర్తి అక్బర్ ఎదుట తలవంచకుండా చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడు. దేశ స్వాతంత్ర్యం కోసం, మాతృభూమి గౌరవం కోసం రాజ్యాన్ని, సుఖసౌకర్యాలను త్యాగం చేసిన మహా వీరుడుమహారాణా ప్రతాప్ 1540 మే 9న రాజస్థాన్‌లోని కుంభల్‌గఢ్ కోటలో జన్మించారు. ఆయన తండ్రి ఉదయ్ సింగ్ తల్లి జయవంతాబాయి. చిన్నప్పటి నుంచే ప్రతాప్‌కు గుర్రపు స్వారీ, ఖడ్గ విద్య, యుద్ధకళలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రాజపుత్ర సంస్కృతి, స్వాభిమానం, ధైర్యం ఆయనలో బాల్యంలోనే బలంగా పెరిగాయి.

మేవార్ రాజ్యానికి వారసుడిగా ఎదిగిన ప్రతాప్ ప్రజల ప్రేమను సంపాదించారు. ఆయన శరీరాకృతి కూడా అపారమైన బలానికి ప్రతీక. చరిత్రకారుల ప్రకారం ఆయన సుమారు 7 అడుగుల ఎత్తు కలిగి ఉండేవారని, యుద్ధంలో భారీ కవచాలు ధరించేవారని చెబుతారు. 16వ శతాబ్దంలో అక్బర్ భారతదేశాన్ని ఏకీకృతం చేయాలని సంకల్పించాడు. అనేక రాజపుత్ర రాజ్యాలు మొఘల్ ఆధీనాన్ని అంగీకరించినా, మేవార్ మాత్రం తలవంచలేదు. అక్బర్ పలుమార్లు మహారాణా ప్రతాప్‌కు దౌత్య ప్రతినిధులను పంపించి మొఘల్ సామ్రాజ్యానికి లోబడాలని కోరాడు. కానీ మహారాణా ప్రతాప్ స్వాతంత్ర్యాన్ని రాజీపడే విషయం కాదని స్పష్టంగా ప్రకటించారు. "రాజ్యాన్ని కోల్పోయినా పరవాలేదు, కానీ స్వాభిమానాన్ని కోల్పోను" అనే దృఢ సంకల్పంతో నిలిచారు. 1576 జూన్ 18న రాజస్థాన్‌లోని హల్దీఘాటిలో మహారాణా ప్రతాప్ సేనలకు, మొఘల్ సేనలకు మధ్య ఘోర యుద్ధం జరిగింది. మొఘల్ సేనకు మాన్ సింగ్ × నాయకత్వం వహించాడు. మహారాణా ప్రతాప్ వద్ద తక్కువ సైన్యం ఉన్నప్పటికీ, అపార ధైర్యంతో పోరాడారు. ఆయన గుర్రం "చేతక్" భారత చరిత్రలో అమరమైనది. యుద్ధ సమయంలో గాయపడిన చేతక్ తన యజమానిని రక్షించి చివరకు ప్రాణాలు విడిచింది. హల్దీఘాటి యుద్ధం సైనికపరంగా స్పష్టమైన విజయం కాకపోయినా, మహారాణా ప్రతాప్ మొఘల్ సామ్రాజ్యానికి ఎప్పటికీ లొంగిపోకపోవడం భారతీయ స్వాతంత్ర్య చరిత్రలో గొప్ప స్ఫూర్తిగా నిలిచింది. యుద్ధం తర్వాత మహారాణా ప్రతాప్ తన కుటుంబంతో కలిసి అడవుల్లో జీవించారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. చరిత్రలో ఒక సందర్భంలో ఆయన కుటుంబం తినడానికి ఆహారం లేక గడ్డి రొట్టెలు తిన్నారని చెప్పబడుతుంది. అయినా ఆయన అక్బర్‌కు లొంగిపోలేదు. స్వాతంత్ర్యం కోసం రాజ్యభ్రష్టుడై జీవించడం ఆయనకు గర్వకారణమైంది. కాలక్రమంలో మహారాణా ప్రతాప్ మళ్లీ బలగాలను సమీకరించి మేవార్‌లోని అనేక ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. చావండ్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలన కొనసాగించారు. ప్రజా సంక్షేమం, వ్యవసాయం, రక్షణ వ్యవస్థల పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. యుద్ధాల మధ్య కూడా ప్రజల అభ్యున్నతిని మరువని పాలకుడిగా నిలిచారుమొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా హల్దీఘట్ లో జరిగిన ప్రసిద్ధ యుద్ధం. 1582లో జరిగిన ఈ యుద్ధంలో మహారాణా ప్రతాప్ మొఘల్ సేనలపై భారీ విజయం సాధించారు. దీనిని "మేవార్ మరాఠాన్" అని కూడా పిలుస్తారు. అడవులు, కొండలను ఉపయోగించి మొఘల్ సేనలపై అనేక చిన్నచిన్న దాడులు చేసి వారిన బలహీనపరిచారు. మహారాణా ప్రతాప్ 1597 జనవరి 19న మరణించారు. వేట సమయంలో గాయపడటం వల్ల ఆరోగ్యం క్షీణించి ఆయన కన్నుమూశారని చరిత్ర చెబుతుంది. మరణించే ముందు కూడా "మేవార్ స్వాతంత్ర్యం కాపాడాలి" అని తన కుమారుడు అమర్ సింగ్ కు ఉపదేశించారు. మహారాణా ప్రతాప్ కేవలం రాజు మాత్రమే కాదు ... స్వాతంత్ర్యానికి ప్రతీక. ఉన్నంతకాలం మహారాణా ప్రతాప్ వీరగాథ ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటుంది.

## యువత మత్తుకు దూరంగా ఉండాలి

### - టాలెంట్ ఉంటేనే ఉద్యోగాలు వస్తాయి
### - మెగా జాబ్‌మేళాలో మంత్రి సురేఖ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హనుమకొండ, మే 8 : యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధా న్యం ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళోజీ కళాక్షేత్రంలో మెగా జాబ్‌మేళా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్యశారదదేవి పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సమాజంలో ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. మనం తప్పు చేయనంతవరకూ ఎవరికీ భయపడొద్దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యానిం చారు. నిత్యం మనలో మనం యుద్ధం చేసుకోవాలని అన్నారు. యువత ఉద్యోగాల ప్రయత్నాలను ఆపొద్దని చెప్పుకొచ్చారు. యువత కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. ఏఐ వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. నేటి పోటీని తట్టుకుని నిలబడాలని అన్నారు. ఉద్యోగం ఎక్కడైనా చేసేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలని చెప్పుకొచ్చారు. ఆర్మీలో తెలం గాణ యువత ప్రాతినిధ్యం తక్కువ అనితెలిపారు. ఉద్యోగం రావా లంటే నైపుణ్యం కలిగి ఉండాలని అన్నారు. ప్రైవేటు ఉద్యోగంలో రాణించాలంటే స్కిల్స్ ముఖ్యమనిచెప్పుకొచ్చారు. తల్లిదండ్రుల కళలు నెరవేరాలంటే కష్టపడాలని సూచించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే నాగరాజు సూచించారు.

# "అభివృద్ధి బాటలో చిట్కుల్ వార్డులు ఎండను సైతం లెక్కచేయని చైర్మన్, కమిషనర్ పాలక' పాదయాత్ర"

**- ఓట్లప్పుడే కాదు. కష్టాల్లోనూ మీతోనే క్షేత్రస్థాయిలో కదం తొక్కిన చైర్మన్ సుమలత శ్రీకాంత్ యాదవ్**

**- డ్రైనేజీ అవుట్‌లెట్ దొరకగానే పనులు మొదలుపెట్టాలని ఆదేశం - చెత్తాచెదారం మధ్య పార్కా? పల్లె ప్రకృతి వనంలా తీర్చిదిద్దుతాం**

**- 6, 7 వార్డుల్లో మున్సిపల్ యంత్రాంగం పాదయాత్ర**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్ చేరు, మే 8 : రాజకీయ నాయకులు అంటే ఏసీ గదులకే పరిమితం అవుతారని, ఎన్నికలప్పుడే బస్తీ బాట పడతారన్న విమర్శలకు భిన్నంగా ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుమలతా శ్రీకాంత్ యాదవ్ క్షేత్రస్థాయిలో కదం తొక్కారు. భానుడు భగ్గుమంటున్నా, ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నా లెక్కచేయకుండా.. చిట్కూల్ పరిధిలోని 6, 7 వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సుదీర్ఘంగా పర్యటించారు. మున్సిపల్ అధికారుల బృందంతో కలిసి గల్లీ గల్లీ తిరుగుతూ ప్రజల ఇబ్బందులను చూశారు.

**అభివృద్ధికి ఆమడదూరంలో మంజీర నగర్**

మున్సిపాలిటీ పరిధిలోని మంజీర నగర్ కాలనీ సందర్శనలో చైర్‌పర్సన్‌కు కనీస వసతులు లేని లోపాలు కనిపించాయి. గత కొంత కాలంగా కాలనీలో కనీసం డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకపోవడం చూసి మున్సిపల్ చైర్మన్ విచారం వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే కేవలం కాగితాల మీద కాదని, ప్రజల ఇళ్ల ముందు కనిపించాలని స్పష్టం చేశారు. మంజీర నగర్ ప్రజలకు త్వరలోనే డ్రైనేజీ, రక్షిత మంచినీటి సౌకర్యాలు కల్పిస్తామని అక్కడికక్కడే హామీ ఇచ్చారు.

**సాంకేతిక అడ్డంకులు తొలగించండి**

కాలనీలో డ్రైనేజీ పనులకు ప్రధాన అడ్డంకిగా ఉన్న 'అవుట్‌లెట్' (నీరు వెళ్లే దారి) సమస్యను అధికారులు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. అవుట్‌లెట్ కోసం మార్గం లేకపోవడంతోనే పనులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దీనిపై స్పందించిన చైర్మన్ సుమలత.. "సమస్య ఉంది కదా అని కాలనీని అలా వదిలేయలేం.. వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించండి, అవసరమైతే కొత్త ప్లాన్ సిద్ధం చేయండి. అవుట్‌లెట్ దారి దొరకగానే యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలి" అని కౌన్సిలర్లతో కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు.



**పార్కుకు పునర్వైభవం.. పచ్చని కళ**

కాలనీలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయిన పార్కు స్థలాన్ని చూసి చైర్‌పర్సన్ అసంతృప్తి వ్యక్తం చేశారు.!దీనిని కేవలం ఖాళీ స్థలంగా వదిలేయకుండా, వెంటనే ప్రహరీ గోడను నిర్మించి, విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె ప్రకృతి వనం' తరహాలో ఈ పార్కును తీర్చిదిద్దుతామని, కాలనీవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని తెలిపారు.

**కౌన్సిలర్ల ఐక్యమత్యం.. కాలనీవాసుల హర్షం**

6వ వార్డు కౌన్సిలర్ బ్యాగరి వెంకటేశం, 7వవార్డు కౌన్సిలర్ ఆంజనేయులు కో- ఆప్షన్ సభ్యులు నిజముద్దీన్ బాబా ఈపర్యటనలో చైర్‌పర్సన్ వెంటేఉండి కాలనీ సమస్యలను ఏకరువు పెట్టారు. వార్డుల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా పని చేస్తామని, చైర్‌పర్సన్ సహకారంతో మంజీర నగర్‌ను అభివృద్ధి దిశలో మారుస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు నేరుగా తమ వాడల్లోకి వచ్చి సమస్యలు వినడం పట్ల కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు స్థానిక ముఖ్య నాయకులు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి

**అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఎబ్బేరు, మే 8: గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో పాడి పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందని, పశువులకు సమయానికి టీకాలు, ఆరోగ్య పరీక్షలు చేయించడం అవసరమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కీమ్యా నాయక్ పేర్కొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, రైతు వారోత్సవాల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పెబ్బేరు పీవీసీలో మెగా ఫెర్టిలిటీ అండ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో పశువులకు వంధ్యత్వ నివారణ చికిత్సలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నులిపురుగుల నివారణ మందులు, పశుగ్రాస విత్తనాలు, ఖనిజ మిశ్రమాలను పశుపోషక రైతులకు పంపిణీ చేశారు. పశుసంవర్ధకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పాల ఉత్పత్తి పెంపే లక్ష్యంగా ఇలాంటి శిబిరాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వెంకటయ్య గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రమోదిని, వైస్ ఛైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, వైద్యులు, పారావెట్స్, గోపాలమిత్రలు, శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రత్యేక విద్య వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**- విద్య వారోత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 08 : ప్రత్యేక విద్య వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 11 నుండి 17 వరకు జరిగే ప్రత్యేక విద్య వారోత్సవాల నిర్వహణ పై శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య వారోత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మొదటి రోజు ప్రారంభోత్సవాలు మైనర్ రిపేర్లు చేపట్టిన వసతుల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు, సమ్మర్ క్యాంపుల నిర్వహణ, పీఎం శ్రీ పాఠశాలల్లో క్యాంపులు ఏర్పాటు. రెండవ రోజు పదవ తరగతి, ఇంటర్మీడియట్ రీమెడియన్ క్యాంపుల నిర్వహణ, ప్రతి సబ్జెక్టు వారీగా నిపుణుల చేత బోధనలు, హాజరు శాతం పర్యవేక్షణ పురోగతిపై సమీక్ష మధ్యాహ్న భోజనం అందించుట. మూడవ రోజు సర్పంచులతో పాఠశాల విద్యా కార్యక్రమాలపై వర్క్ షాప్, మండల స్థాయిలో కార్యక్రమాలు, డిజిటల్ ప్రచారం. నాల్గవ రోజు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం, ర్యాలీలు, తల్లిదండ్రుల సమావేశాలు, పూర్వ విద్యార్థుల సమావేశాలు, ఐదవ రోజు గ్రంథాలయ దినోత్సవం, పుస్తక ప్రదర్శనలు, ఉత్తమ పాఠకుల గుర్తింపు, బుక్ టాక్ కార్యక్రమాలు, పుస్తకాల పంపిణీ శిబిరాలు, ఆరవ రోజు కలలు ప్రత్యేక సంస్కృతిక దినోత్సవ కార్యక్రమాలు, చిత్రలేఖనం, హస్తకళలు, కోలాటం, ఒగ్గు కథ, సాంప్రదాయ కళా ప్రదర్శనలు, దివ్యాంగ విద్యార్థుల కళాఖండాల ప్రదర్శన, ఉత్తమ విద్యార్థుల గుర్తింపు సన్మానం, ఎడవ రోజు విద్య విజయోత్సవ దినోత్సవం , విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మాన కార్యక్రమాలు, ప్రతి విభాగానికి సంబంధించి ముగ్గురు టాపర్లను పురస్కారం, ప్రజా ప్రతినిధులు అధికారులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ప్రాధాన్యత ఇవ్వాలని, షెడ్యూల్ ప్రకారం నిర్వహించే ప్రతి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కార్యక్రమ వీడియో ఫోటో డాక్యుమెంటరీ రెడీ చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఇంగ్లీష్ మీడియం కు ప్రాధాన్యత కల్పిస్తూ విద్యార్థులకు ఇంగ్లీష్ భాష పై పట్టు వచ్చే విధంగా మాట్లాడాలన్నారు. పీఎం శ్రీ పాఠశాల మాదిరిగా ప్రతి పాఠశాలలో క్రమశిక్షణ పట్టుదల ప్రతి సబ్జెక్టు పై నాలెడ్జ్ తో కూడిన, నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, విద్యాశాఖ ప్లానింగ్ ఏసీజీ విభాగాల అధికారులు శ్రీరాములు, అప్పారావు, పూర్ణచందర్, సంతోష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సొంత ఇంటి కల సాకారం చేస్తాం

**- మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 08 : ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సొంతింటి కల సాకారం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు. ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రం ద్వారా కోరుట్ల పట్టణశీలోని నక్కల గుట్ట ప్రాంతానికి చెందిన బండ్ల లక్ష్మీ గంగాధర్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టుకొని శుక్రవారం ఇందిరమ్మ నూతన గృహప్రవేశశీ చేశారు. స్థానిక నాయకులతో కలిసి కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద మధ్య తరగతి ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటి ప్రొసిడింగ్ అందిస్తున్నామని తెలిపారు. ప్రొసిడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని ఇంటి నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బుజమవుతాయన్నారు. ప్రొసీడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం త్వరగా చేపట్టాలని సూచించారు. ఎవరైనా ఇల్లు రానివారు అర్హులు ఉంటే వారందరికీ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగ లింగం, చిటిమెల్లి రంజిత్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ యజమానులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ కమర్షియల్ షాపులు కేటాయించాం

**రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, డిసిసి చీఫ్ శివసేన రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 8 : సకల సదుపాయాలతో రూపొందించిన సమీకృత మార్కెట్ సముదాయాన్ని వ్యాపారస్థులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్దేశంతో పారదర్శకంగా షాపులను లాటరీ పద్ధతి ద్వారా తీయడం జరిగిందని, షాపులు రానివారు నిరాశ చెందద్దని, రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి కోరారు. వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డు ప్రాంతంలో నూతనంగా సకల సదుపాయాలతో నిర్మించిన సమీకృత మార్కెట్ సముదాయంలోని మొదటి అంతస్తులో శుక్రవారం రిజిస్ట్రేషన్ అస్యూరెన్స్ కార్యాలయాన్ని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అంతకుముందు అర్చకులు వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డి మాట్లాడుతూ ... సమీకృత మార్కెట్ సముదాయం పూర్తి అయి దాదాపు 2 సంవత్సరం పైగా అవుతున్నప్పటికీ షాపుల అద్దె ఎక్కువగా ఉండటంతో షాపులు తీసుకోడానికి వ్యాపారస్తులు ఎవరు మొగ్గు చూపకపోవడంతో పరిస్థితిని గమనించి, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభితో సమన్వయం చేసుకొని నిర్ణయించిన రేట్లలో సగానికి తగ్గించి ప్రతిపాదనలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ను పంపించగా అట్టి ప్రతిపాదనలు ఆమోదించినందుకు గాను వనపర్తి ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమీకృత మార్కెట్ లో షాపులు పొంది ప్రార్భోత్సవాలు చేసుకున్న రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖరులకు శుభాకాంక్షలు తెలిపారు. సమీకృత మార్కెట్ సముదాయంలో మరింతగా డిమాండ్ జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి, జిల్లా రిజిస్ట్రార్ ఫణీంద్ర, సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పలువురు పాల్గొన్నారు.



# జీఎంను కలిసిన బీసీ అసోసియేషన్ ప్రతినిధులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 08 : సింగరేణి ఆర్జీ-2 ఏరియా జీఎం బండి వెంకటయ్యను బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) అరవింద్ రావు, ఏజీఎం (ఐఈడీ) చంద్రశేఖర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్ కుమార్, బీసీ జనరల్ సెక్రటరీ రమేష్, ఏరియా లైజన్ ఆఫీసర్ ఫణి కుమార్, బీసీ, ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు ఐలి శ్రీనివాస్‌తో పాటు చిప్ప నారాయణ, మార్కండేయ, పోచయ్య, బాబురావు, వెంకటేష్, చౌడ శ్రీనివాస్, తిరుపతి, గౌతమ్, సతీష్, శ్రీనివాస్, రవి, రాజేశం, వివేక్, సందీప్, ఉదయ్, రాజ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగసాన్ పల్లిలో పశువైద్య, శిబిరం పశు పోషణపై అవగాహన కార్యక్రమం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 08 : ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలలో భాగంగా శుక్రవారం రోజు నాగ్సన్ పల్లి గ్రామంలో పశు వైద్య శిబిరం మరియు పశుపోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పశువైద్య శిబిరం, దూడల ప్రదర్శన, పశుగ్రాస విత్తనాల పంపిణీ, వేసవిలో పశువుల యజమాన్యంపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో 94 గేదెలు, 48 ఆవులకు గర్భధారణ పరీక్షలు, చికిత్సలు 37 దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించినట్లు పశువైద్యాధికారులు డా. సౌమ్య, డా. ప్రవీణ్ లు తెలిపారు. వైద్య శిబిరంలో పశువులకు గర్భధారణ పరీక్షలు, ఎదకు రాని పశువులకు చికిత్సలు, సరైన సమయంలో కృత్రిమ గర్భాధారణ, మినరల్ మిక్సర్, సమతుల్య ఆహారం గురించి రైతులకు అవగాహన కల్పించామన్నారు. దూడల సంరక్షణ గురించి, దూడలకు ముర్రుపాలు తాగించడం, టీకాలు, దూడల పోషణ, పరిశుభ్రత, ఆడ దూడల ప్రత్యేక సంరక్షణ, మరియు భవిష్యత్తులో పాలిచ్చే పశువులుగా వాటి ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. వేసవిలో పశువులకు చల్లని త్రాగునీరు, నీడ, గాలి ప్రసరణ ఎక్కువ ఎండ సమయంలో మేతకు లేదా రవాణాకు తీసుకు వెళ్లకుండా ఉండటం, అధిక పాలిచ్చే పశువులకు ప్రత్యేక సంరక్షణ గురించి అవగాహన కల్పించామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దండెం సుశీల దుర్గయ్య, ఉపసర్పంచ్ ఎండీ.సిరాజ్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఎం.సతీష్ కుమార్, శివాజీ, పులి సురేష్, సమీర్, సిబ్బంది అడిగప్ప, సుధాకర్, యాదయ్య, గోపాలమిత్ర సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, గోపాల మిత్రలు షర్ఫుద్దీన్, సాయిలు, బాలరాజ్ గ్రామ పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.




# జనగణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 8 : జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని సమగ్ర సమాచారం దేశ అభివృద్ధికి పునాది అవుతుందని ములుగు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ వాసుదేవరావు పేర్కొన్నారు. జన గణన పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వరకు నిర్వహించిన జనగణన అవగాహన వాక్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ వాసుదేవరావు పాల్గొని అవగాహన వాక్ ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సెల్ఫ్ ఎన్యుమరేషన్ సౌకర్యాన్ని మే 10వ తేదీ వరకు తమ వ్యక్తిగత సెల్ ఫోన్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా, ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, పూర్తయిన తర్వాత ఒక యూనిక్ ఐడీ జనరేట్ అవుతుందని, అందరూ ఈ స్వీయ గణనలో నమోదు చేసుకోవాలని కోరారు. ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడీ చూపిస్తే సరిపోతుందని అన్నారు. ఈ గృహ గణనలో భాగంగా ఎన్యుమరేటర్లు సుమారు 33 ప్రశ్నలు అడుగుతారని, ఇంట్లో మంచినీటి సౌకర్యం, కారు, టీవీ, సెల్ ఫోన్ వంటి పలు కనీస సౌకర్యాల గురించి సమాచారం నమోదు చేస్తారని తెలిపారు. ప్రజలు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్యుమరేటర్లు సేకరించిన వివరాలను ఆర్టీఐ చట్టం కింద కూడా ఎవరికీ ఇచ్చే అవకాశం ఉండదని తెలిపారు. ఈ హౌస్ లిస్టింగ్ 2027 ఫిబ్రవరిలో జరిగే ప్రధాన జనాభా గణనకు మొదటి దశ అని, ఎన్యుమరేటర్లు అడిగే ప్రశ్నలకు ప్రజలు సరైన సమాధానాలు చెప్పి సహకరించాలని, ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. అదే విధంగా జనగణనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన అవగాహన వాక్‌లో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్. జి, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సిబ్బంది, యువత, విద్యార్థులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# టేక్మాల్ లో పశు వైద్య శిబిరం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ మే 08 : ప్రజాపాలన ప్రగతి ప్రణాలిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక లో బాగంగా టేక్మాల్ మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక పశు వైద్యశాలలో పశువైద్య, అవగాహాన శిభిరం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమనికి స్టానికా సర్పంచ్ సుధాకర్ ముఖ్య అతిధిగా వచ్చారు. దూడలకు నట్టల నివారణమందునును పంపిని చేశారు. అలగే పశు గ్రాస విత్తనాలు సబ్సిడీ పై అందచేయడం జరిగింది. అనంతరం పశువైద్యశాల. డాక్టర్లు నాగరాజు, సౌమ్య,మాట్లాడుతూ వేసవి లో రైతులు పశుసంరక్షణపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్ని రైతులకు, వాటికి చల్లటి నీరు, ఎండ సమయాంలో మేతకు తీసుకు వెళ్ళకూడదనే విషయము రైతులకు తెలిపారు అలగే పుట్టిన వెంటనే దూడలకి, (ముర్రు) పాలు తాగించలన్ని, డివార్మింగ్ చేయడం,వాటి పోషణ, పరిశుభ్రత పాటించాలని అవగాహనా సదస్సులో తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ హనుమంతు, అమరావతి, గోపాలమిత్ర సిబ్బంది, దీపక్, రవి, దేవరాజ్ ఆనంద్, కృష్ణ, శామల, గ్రామ.రైతులు పాల్గోన్నారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్ జీ.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగుమే 8 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్. జి. సంబధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జీ. తన ఛాంబర్ లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ అంశాలపై జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు 13.05.2026 నుండి 21.05.2026, ప్రాక్టికల్ పరీక్షలు 22.05.2026 నుండి 25.05.2026 వరకు జరగనున్నాయని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని, పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసామని, పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, బందోబస్తు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, పోస్టల్ సేవలు తదితర అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ జనరల్ విభాగంలో 1050 మంది, వోకేషనల్ విభాగంలో 39 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 227 మంది, వోకేషనల్ విభాగంలో 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.ఇ.ఓ నాయిని వీరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

## జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మే 08 : అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆబ్కారీ - మద్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ క్లబ్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎస్.పి. నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కాప్దే అనిల్, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్ పర్సన్ షాహిన్ సుల్తానా లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రికి మాట్లాడుతూ జిల్లాలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. బోరిగాం శివారులో నిర్మించిన 2 పడక గదుల ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణానికి మొదటి విడతలు 630 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, మొదటి విడతలో రానివారు నిరాశ చెందవలసిన అవసరం లేదని, అర్హత గల వారికి రెండవ విడతలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, రహదారి విస్తరణ, మురుగు కాలువల వ్యవస్థ, సి సి రహదారుల ఏర్పాటు నిధులు మంజూరు చేసే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న వంతెనల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొమురం భీం ప్రాజెక్టు ఆనకట్ట పనులు సి డబ్ల్యూ సి నివేదిక రాగానే ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి 18 కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందజేయడంలో ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మాణం చేపడితే ఈ ప్రాంతానికి సాగునీరు అంది భూములు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు అందరూ సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి అదనంగా నిధులు మంజూరు చేయాలని, పోడు భూములను సాగు చేయకుండా అటవీ అధికారుల అడ్డుపడుతున్న సమస్యను పరిష్కరించాలని, కార్మికుల సంక్షేమం కోసం సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం 288 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి.డి. టి.ఎన్. ప్రకాష్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# కాగజ్‌నగర్ పేపర్ మిల్లును సందర్శించిన మంత్రి జూపల్లి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 8 : పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం కాగజ్‌నగర్‌లోని పేపర్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మిల్లులోని వివిధ విభాగాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. కలప నుంచి కాగితం తయారయ్యే వివిధ దశలను మంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కలపను ముక్కలుగా చేయడం (చిప్పింగ్), ఆపై గుజ్జుగా మార్చడం, రసాయనాల వినియోగం నుంచి తుది దశలో పేపర్ రోల్స్ సిద్ధమయ్యే వరకు సాగే సంక్లిష్ట ప్రక్రియను, యంత్రాల పనితీరును మిల్లు సాంకేతిక నిపుణులు ఆయనకు వివరించారు. ఉత్పత్తి, కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె హరిత ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రగతికి ప్రణాళికాబద్ధంగా అడుగులు:జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 8 : తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్నతో పాటు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మే 11 నుండి 17 వరకు చేపట్టనున్న వారాంత కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులకు శంకుస్థాపనలు చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ, ఇంటర్మీడియట్ విద్యార్థుల రెమెడియల్ తరగతులు పూర్తి చేసి, పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక రెమెడియల్ తరగతులను ప్రారంభించాలని తెలిపారు. ఏడు రోజుల ప్రణాళికలో భాగంగా పలు వినూత్న కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. "సెలెక్టివ్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్" కింద నియోజకవర్గ స్థాయిలో సర్పంచులకు ప్రత్యేక వర్క్‌షాపులు నిర్వహించి, పాఠశాలల అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా "జయశంకర్ బడిబాట", మెగా టీచర్-పేరెంట్ మీటింగ్, లైబ్రరీ డే, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు "కళావైభవం" పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, వారాంతంలో "విద్యా విజయోత్సవం" ఘనంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# జనగణనపై అవగాహన కల్పించేందుకు భారీ మారథాన్ నిర్వహణ

## జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 8 : దేశాభివృద్ధికి కీలకమైన జనగణన ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్మల్ పట్టణంలో భారీ మారథాన్ నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుండి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన ఈ మారథాన్‌ను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, దేశ ప్రగతి, ప్రణాళికాబద్ధ అభివృద్ధికి జనగణన అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ అని తెలిపారు. జనాభా లెక్కల ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలు రూపొందించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల ప్రణాళిక చేపడుతుందని వివరించారు. జనగణన-2027లో భాగంగా ప్రతి పౌరుడు "స్వీయ గణన" (ూవశ్రీట-జుఅబఎవతీు-ఱశీఅ) విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి కుటుంబం తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవాలని కోరారు. అవగాహన లేని వారికి ఇతరులు సహకరించాలని, సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, సి పి ఓ జీవరత్నం, డి వై ఎస్సీ ఓ కాంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, ఎల్‌డీఎం రామ్ గోపాల్, డీపీఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ పీజీ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తూకంలో పారదర్శకంగా జరిగేందుకు పటిష్ట చర్యలు

## మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 08 : రైతు సంక్షేమంలో భాగంగా మెదక్ జిల్లాలో 533 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై కలెక్టర్ గారు ఒక ప్రకటన విడుదల చేస్తూ రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో సంబంధిత నగదును జమ చేసే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళలలో ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియ కొనసాగించడం జరుగుతుందని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి 67,489,480 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చెసి 62.87 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడము జరిగింది అని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్ల తో కప్పి ఉంచాలని కేంద్రాల నిర్వహకులకు తెలియజేయటం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు, రవాణా అంశాలలో వేసవి ఉష్ణోగ్రతతో పాటు ఇతర రాష్ట్రాలలో కొనసాగుతున్న ఎన్నికల సందర్భంగా రైస్ మిల్లుల నందు హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న ధాన్యం త్వరగా ఆరబెట్టి రైస్ మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని, వరి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అందుబాటులోపరికరాలు జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. టార్పాలిన్లు 15540, తూకం వేసే యంత్రాలు 668 ప్యాడీ క్లీనర్లు 278 తేమ శాతం చూసే మెషిన్లు 664 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని కలెక్టర్ సూచించారు.



# అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి

## - టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి మానుక ప్రవీణ్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 08 : ఇటీవల కురిసిన అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుట్ల నియోజకవర్గ టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి మానుక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోరుట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించి, నష్టపోయిన మామిడి, మొక్కజొన్న, వరి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా మానుక ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ .. రైతులు మార్కెట్ యార్డులోకి మక్కలు తెచ్చి దాదాపు 25 రోజులైనా పట్టించుకున్న నాథుడు లేడని, దీనివలన అకాల వర్షంతో మక్కలన్ని తడిసి, రైతులకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. తడిసిపోయిన మక్కలను, మార్కెట్ యార్డులో ఉన్న మక్కలను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని విధాలుగా మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోరుట్ల మండలంలోని యూసుఫ్ నగర్, ఐలాపూర్ గ్రామాలలో పర్యటించి, ఈదురు గాలులతో రాలిపోయిన మామిడి పంటలను పరిశీలించారు. నష్టపోయిన మామిడి రైతులను కూడా ప్రభుత్వం డిమాండ్ చేశారు. రైతు లేనిదే రాజ్యం లేదని అన్న నినాదాన్ని వెంటనే ప్రభుత్వం అమలు చేసి, జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మారుతి, మహాదేవ్, రాజు, నదీమ్, నష్టపోయిన రైతులు నల్ల శ్రీనివాస్, లక్ష్మి, పల్లికొండ మనోహర్, బుడిగె మల్లవ్వ, చిన్న గంగారం, కాట్పల్లి శేఖర్, నాగరాజ్, రాజన్న, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంబరంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

## - పేదింటి కల నెరవేరిన లబ్ధిదారులు

## - నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్. భీమ్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 8 : నర్సాపూర్ జి. నర్సాపూర్ గ్రామం. నిర్మల్ నియోజకవర్గం లోని మండలకేంద్రములో ని గ్రామం లోని దర్శనాల భోజమ్మ ఇంట్లో ఆనందోత్సవాలు వెల్లివిరిసాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టత్మాకంగా చెప్పడు తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో భాగంగా గాజుల నర్సాపూర్ గ్రామానికి చెందిన భోజమ్మ మధుసూదన్ దంపతులు శుక్రవారం రోజున ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశన్ని చేసుకొని సంబరాలు చేసుకున్నారు. ఆ సంతోషన్ని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ తోఅపురూపం గా పంచుకున్న సందర్భం. చాలా ఏళ్ళు గా తమ కు స్వంత ఇల్లు కల సాకరం చేసిన ముఖ్య మంత్రి రెవెంత్ రెడ్డి గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో ప్రభుత్వం నుండి లభించే విడతలవారి డబ్బు తమకు సకాలంలో అందిందని ఈ విషయం లో ఎలాంటి కాలయాపన జరగలేదని వారు ఆనందం తో చెప్పారు. ఈ విషయమై మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ పేదవారి కళ్ళల్లో నిజమైన ఆనందం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని కూడు, గూడు, గుడ్డ అందించే నిజమైన కళ సాకరం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గడ్డం ఇంద్రకన్ రెడ్డి తో పాటు నాయకులు పాల్గొన్నారు

# పశు వైద్య ఆరోగ్య, పశు సంపద సంతానోత్పత్తి మెగా శిబిరం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 08 : భీమారం మండలం మన్నెగూడం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్య ఆరోగ్య, పశు సంపద సంతానోత్పత్తి మెగా శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో మొత్తం 45 పశువులకు, 173 గొర్రెలు, మేకలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ గోపిడి మహిపాల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నివేదిత మనోజ్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మన్నెగూడం వెటర్నరీ డాక్టర్ వెన్నెల, ఇతర డాక్టర్లు, సహాయక సిబ్బంది మురళి, గంగ జమున, గంగాధర్, రాజం, రమేష్ లు పాల్గొని పశుపోషకులకు విలువైన సూచనలు అందించారు. శిబిరంలో పశువుల ఆరోగ్య పరీక్షలు, అనారోగ్య పశువులకు చికిత్సలు, కృత్రిమ గర్భధారణ సేవలు, గర్భధారణ పరీక్షలు, సంతానోత్పత్తి చికిత్సలు, పశుగ్రాసాల సాగు, సెక్స్ సార్టెడ్ సెమెన్ వినియోగం, ఆధునిక పాడి యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై పశుపోషకులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రైతులకుసబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందజేశారు. ఆధునిక పాడి యాజమాన్య పద్ధతులు అవలంబిస్తున్న పశుపోషకులను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజా ప్రతినిధులు, పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమే రైతులకు నష్టం

## - తడిసిన ప్రతి గింజ కొనాలి - రైతు సంఘం నేత గుమ్మడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 8 : రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసినప్పటికీ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితమే ఐకెపి కళ్లాల్లో నిల్వ చేసిన వరి ధాన్యం నీట మునిగి రైతు కన్నీటికి కారణమని రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుమ్మడి వెంకన్న ఆరోపించారు. శుక్రవారం అంతర్గాం మండలంలోని పలు ఐకెపి కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. వరి కోతలు ప్రారంభించినప్పుడే అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని వెంకన్న ఆరోపించారు. ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని కల్లాలకు చేరిస్తే అకాల వర్షంతో నీటి పాలు కావడం రైతులు తీవ్ర ఆందోళనకు మానసిక వేదనకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం అధికారులు తడిసిన ప్రతి వరి గింజను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందించి రైతులను ఆదుకోవాలని వెంకన్న కోరారు. అదేవిధంగా తాలు తప్ప అంటూ లారీకి రెండు నుంచి నాలుగు క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కటింగ్ చేస్తున్నారని ఈ దోపిడీని స్థానిక ప్రజాపతినిధులు గుర్తించి కట్టడి చేసి మిల్లర్లపై తగిన చర్యలు తీసుకొని రైతులకు మేలు చేయాలని వెంకన్న కోరారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్ర మాలు చేపడ్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తీగుట్ల రాములు కట్కూరి వెంకటేష్ రాయలింగు పొట్ట సాగర్ ఆడపు తిరుపతి రమేష్ వెంకటేష్, దేశభతుల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 8 :విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా భద్రాద్రి జిల్లా మణుగూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవీ మణుగూరు ఫీడర్, 11కేవీ సుందరయ్య నగర్ ఫీడర్, 11కెవి అన్నారం, 11కేవీ పాతమణుగూరుఫీడర్ లలోరెండవ శనివారం మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8నుంచి10గంటల వరకువిద్యుత్ సరఫరా అంతరాయం కలుగు తుందని మణుగూరు విద్యాశాఖ అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గుట్టమల్లారం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు ఎటువంటి అంతరాయం కలగదనీ, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించ గలరనీ టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొన్నారు .

# కొత్తగూడెంలో నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

## లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు అంతరాయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 8 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లు పేర్కొన్నారు. చుంచుపల్లి మండలం పరిధిలోని రామవరం, గరిమెల్లపాడు, ఏపీహెచ్ బస్తీ, ఫ్యూన్ బస్తీ ప్రాంతాల్లో ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. అదేవిధంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రైటర్ బస్తీ, గొల్లగూడెం, బస్ స్టాండ్, బర్లిపిట్, బర్మా క్యాంప్, విద్యానగర్ కాలనీ, రాంనగర్, ఎన్‌కే నగర్, రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, గాంధీ కాలనీ, వికలాంగుల కాలనీ, మాజీ సైనికుల కాలనీ, శేషగిరి నగర్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు శాఖకు సహకరించాలని ఏఈ హేమచంద్ర బాబు కోరారు.

# మూసీ తొలిదశ పనులకు 7,055 కోట్లు

సబ్ కమిటీ ఆదేశించింది. నదిలోని చెత్తను తొలగించి, రివర్ బెడ్ ప్రొఫైలింగ్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించనున్నారు. మూసీ రెండు వైపులా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణకు డీపీఆర్‌ను తయారీకి నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు వివరాలను నగరవ్యాప్తంగా ప్రచారం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. బస్టాండ్లు, ప్రధాన రోడ్లు, థియేటర్లలో ప్రచార వీడియోలు ప్రదర్శించనున్నారు. 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించడం లక్ష్యంగా నిర్ణయించారు. డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈప్రాజెక్ట్ సాంకేతికపర్యవేక్షణకు సహకారం తీసుకోనున్నారు. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.

## కేంద్రం నిధులతోనే తెలంగాణ బండి నడుస్తోంది

మొదటిపేజీ తరువాయి

నడుపుకోవడానికి తెలంగాణ సొమ్మును వినియోగిస్తున్నారని ఆరోపించారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కోసం మోదీ హైదరాబాద్ వస్తున్నారని వివరించారు. తమ నినాదం జై శ్రీరాం... జై తెలంగాణతోపాటు ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే అని స్పష్టం చేశారు. జై శ్రీరాం.. జై తెలంగాణ నినాదాలతో పరేడ్ బహిరంగ సభ దద్దరిల్లుతుందని చెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాదిరిగా తనకు దోచుకోవడం తెలియదన్నారు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం తనకు తెలియదని చెప్పారు. డ్రగ్స్ తీసుకోవడం కూడా తమకు తెలియదని పేర్కొన్నారు. కాళేశ్వరం, ఈ ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి వంటివి తమకు తెలియదని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యంగ్యంగా అన్నారు. ఫాంహౌస్ డ్రగ్స్ కేసులు కూడా తమకు తెలియదని చెప్పారు. మంది కొంపలు ముంచడం అనలే తెలియదంటూ కేటీఆర్‌కు చురకలు అంటించారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు. నీ అహంకారం వల్లే కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారని చెప్పారు. నీ కార్యకర్తలే కేటీఆర్‌ను చూసి ఆ పార్టీ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఏం చేసినా అధికారంలోకి రావడం కల్ల అని కుండ బద్దలు కొట్టారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని ఆయన జోస్యం చెప్పారు. మోదీ సభ తరువాత రాష్ట్రంలో జరగబోయేది చూడండంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మే10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## తెలంగాణకు కేంద్ర సహకారంపై చర్చకు సిద్ధం

మొదటిపేజీ తరువాయి

ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు. గవర్నర్ చర్యలను బిజెపికి అంటగట్టి విమర్శించడం మానుకోవాలన్నారు.

## తమిళనాడు ఉత్కంఠకు తెర

మొదటిపేజీ తరువాయి

అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. మే 4న అసెంబ్లీ ఫలితాలు వెలువడిన అనంతరం గవర్నర్‌ను విజయ్ కలవడం ఇది మూడోసారి. విజయ్ రెండు చోట్ల గెలవడంతో టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉంది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరమైంది. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ బలం 112కు చేరింది. ఈ క్రమంలో ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ, సీపీఎం సైతం బేషరతుగా టీవీకేకు మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మెజారిటీ అవసరమైన 118 మంది సభ్యుల బలం టీవీకే సంపాదించగలిగింది. దీనికితోడు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకేకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల బలం 120కి చేరుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరడానికి అడుగులు పడుతున్నా.. మిత్రపక్షాల షరతులు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. అటు కాంగ్రెస్, ఇటు వామపక్షాలు వీసీకే తమ మద్దతుకు సంబంధించి కీలక ప్రకటనలు చేశాయి. విజయ్ ప్రభుత్వంలో భాగస్వామ్యంపై వామపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేశాయి. టీవీకే ప్రభుత్వానికి తాము కేవలం బయటి నుంచే మద్దతు ఇస్తామని.. కేబినెట్‌లో చేరే ఉద్దేశం లేదని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. ప్రస్తుత రాజకీయ అనిశ్చితిని తొలగించి, ఒక సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్న ఉద్దేశంతోనే విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఇక, టీవీకేకు ముందుగానే మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. విజయ్‌కు ఒక కీలకమైన షరతు విధించింది. భవిష్యత్తులో టీవీకే ఎట్టి పరిస్థితుల్లోనూ మతతత్వ పార్టీలతో చేతులు కలపకూడదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ షరతుకు లోబడి ఉంటేనే.. తమ 5 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంటుందని హైకమాండ్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకమైన 2 స్థానాలు కలిగిన విదుతలై చిరుతైగల్ కట్చి అధినేత తోల్ తిరుమావళవన్ తనదైన వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు. వచ్చే ఉపఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని ఆయన షరతు పెట్టారు. తిరుమావళవన్ స్వయంగా తిరుచ్చి ఈస్ట్ నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ స్థానం ఇస్తేనే టీవీకేకు మద్దతుపై తుది సంతకం చేసే అవకాశం ఉంది.వామపక్షాలు కేబినెట్‌లో చేరకపోవడం వల్ల విజయ్ తన సొంత పార్టీ ఎమ్మెల్యేలకే ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చుకునే అవకాశం ఉంటుంది. కానీ, తిరుమావళవన్ కోరుతున్న 'తిరుచ్చి ఈస్ట్' స్థానం విషయంలో విజయ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

మొదటిపేజీ తరువాయి

కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాల పై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, 'అభివృద్ధి – ప్రజా హితం' రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశర చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసి పునర్జీవన ప్రాజెక్టు 5దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఫేజ్ -1 సుమారు 7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చు కునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ -1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగార్ నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు. మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ప్రొ÷ల్గ÷లింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణాం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డిపిఆర్ ను మూసి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి నర్సింహ్మారెడ్డి మంత్రులకు వివరించారు. ఈస్ట్–టు–వెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి –గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్త్రతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక, అనుమతులు, విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. రాజధాని అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన గడువును నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని రకాల అనుమతులు, విధానపరమైన పక్రియలు పూర్తి చేసుకుని 2026 ఆగస్ట నాటికి పనులు ప్రారంభించాడానికి లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఈ బృహత్తర ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలన్నారు.. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్ ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. టైంలైన్ నిర్దేశిరచుకొని స్పష్టమైన పురోగతి కనిపించే విధంగా పనుల నిర్మాణం జరుగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఏలాంటి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో సాంకేతికపరమైన అంశాలలో ఐఐటి, జెఎన్ టియూ సంస్థల నుంచి తగిన సహాకారం తీసుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించే విధంగా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మూసీ పునర్జీవం ప్రాజెక్టులో టూరిజం అభివృద్ధిలో భాగాంగ నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణాల వల్ల నీటి నిల్వను పెంచడం, జలక్రీడలు, మరియు బోటింగ్ సదుపాయాలకు ఉపయోగపడుతుంది. ఒబెర్ మేయర్ స్పిల్ వే గేట్ టెక్నాలజీ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు ఆసక్తిగా తిలకించారు. నాసిక్, ముంబాయి నగరాల్లో ఈ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేసిన రబ్బర్ డ్యాంలను పరిశీలించి తగిన అధ్యయనం చేసిన తరువాత నివేధిక ఇవ్వాలని అధికారులను మంత్రులు అదేశించారు. ఈ సమవేశంలో మెట్రో పాలిటన్ ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణా భాస్కర్, వాటర్ బోర్డు ఎం.డి అశోక్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ– వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

మొదటిపేజీ తరువాయి

మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 2006–09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయి (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు. తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్–2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

## దేశమంతా కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకుంది

మొదటిపేజీ తరువాయి

ప్రశ్నించారు. రేవంత్‌కు కంటిలో నలుసులా తయారయ్యామని అరెస్టు చేస్తారా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలేవి? రైతు డిక్లరేషన్ సంగతి ఏమైందని నిలదీశారు. బీఆర్ఎస్ ఆందోళనతో కాంగ్రెస్ ఆగమైతుందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బావుసింగ్ భూక్య తండాలో శుక్రవారం జరిగిన జగదాంబ మాత సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా వీర్నపల్లిలో కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేస్తామని కేటీఆర్ తెలిపారు. మన ప్రభుత్వం లేకున్నా గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మనకు మళ్లీ మంచిరోజులు తిరిగి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌ది దండుపాళ్యం ముఠా అని విమర్శించారు. మేడారం అభివృద్ధి పనుల్లో వాటాల కోసం మంత్రులు కొట్లాడుకున్నారని గుర్తుచేశారు. ఏ ఊరికి వెళ్లినా మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఒక్క ఓటు తప్పునకు ఐదేళ్ల శిక్ష తప్పదని.. ఓపిక పట్టాలని సూచించారు. ఇవాళ ఏవారం.. రేపు ఏవారం తప్ప బీజేపీ వాళ్లకు ఏమీ తెలియదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కొడంగల్‌పైనే కాదు..రాష్ట్రంపై శ్రద్ద పెట్టాలి

మొదటిపేజీ తరువాయి

మాత్రమే సరిపోదని, నీ ళ్లు పొలాల వరకు చేరాలంటే కాలువలు కూడా నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రైతులకు ఆశించిన ప్రయోజనం కలగలేదని విమర్శించారు. టీఆర్ఎస్ నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతానికి తగిన న్యాయం జరగలేదని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు 12 సీట్లు ఇచ్చినా అభివృద్ధి పనులు కనిపించలేదని అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ప్రకటించాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. అలాగే జనగణనలో కులగణన నిర్వహించాలని, రాష్ట్రం పంపిన బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని కోరారు. కృష్ణా నది తెలంగాణలో ప్రవహిస్తున్నప్పటికీ ఆ నీళ్లు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ అభివృద్ధిపైనే కాకుండా రాష్ట్రం మొత్తం అభివృద్ధి బాధ్యత తీసుకోవాలని అన్నారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకే తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని పేర్కొన్న కవిత.. త్వరలో మరో నీటి ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆ ఉద్యమానికి లక్ష్మీదేవిపల్లి వేదిక కావడం గర్వంగా ఉందని చెప్పారు. ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## పోలీస్ అధికారి భార్య హత్య

మొదటిపేజీ తరువాయి

వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనుజాను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తం గా ఉండాలని సూచించారు. నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనుజ గ్రౌండ్ ఫో÷–లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితులు బ్యాక్ గేట్ నుంచి ఇంట్లోకి ప్రవేశించారని.. ఘటన అనంతరం వెనుక నుంచి పారిపోయారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందాలి

**- వైద్యులు, సిబ్బంది సమయపాలనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి**
**- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**
**-మధిర ఆసుపత్రి, విద్యాసంస్థల నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 8 : ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. శుక్రవారం మధిర నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్, మధిర పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఎల్‌డీఆర్‌ఎం రూమ్, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డు, రేడియాలజీ బ్లాక్, ఓపీ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, ఔషధాల లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందితే ప్రజల్లో విశ్వాసం పెరిగి ఎక్కువ మంది ఆసుపత్రులను ఆశ్రయిస్తారని అన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసర సి-సెక్షన్ ఆపరేషన్లను నివారించాలని వైద్య అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను తగిన మోతాదులో నిల్వ ఉంచాలని, రోగులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం నాణ్యతపై కూడా రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ సేవాభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మధిర మండల కేంద్రంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, రూ.4 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. తదుపరి సిరిపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ భవనం, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి, పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. కలెక్టర్ వెంట మధిర తహసీల్దార్ రాంబాబు, విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన డిఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన వసంత కుమారి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసిన డిఆర్వో**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 8 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నూతన జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్వో)గా బాధ్యతలు స్వీకరించిన వసంత కుమారి శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, డిఆర్వో వసంత కుమారికి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. డిఆర్వో వసంత కుమారి మాట్లాడుతూ, జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు.



# మణుగూరు సురక్ష బస్టాండ్ వద్ద వాహనదారుల ఇక్కట్లు

**- పైప్‌లైన్ పనులతో బురదమయమైన రహదారి**
**- వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ప్రజల డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 8 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు ప్రధాన రహదారిలో సురక్ష బస్టాండ్ ప్రాంతంలో మున్సిపాలిటీ చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులు వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. పైప్‌లైన్ ఏర్పాటులో భాగంగా అధికారులు రోడ్డు పక్కన గోతులు తవ్వి పనులు పూర్తి చేసిన అనంతరం మట్టిని పూడ్చి వదిలేయడంతో, చిన్న వర్షానికే రహదారి పూర్తిగా బురదమయంగా మారుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారిపై బురద పేరుకుపోవడంతో వాహనాలు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. "పైప్‌లైన్ పనులు పూర్తయ్యాక రోడ్డు మరమ్మత్తులు చేయాల్సిన బాధ్యతను అధికారులు విస్మరించారు" అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి రహదారిని రాకపోకలకు అనుకూలంగా మరమ్మత్తులు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# సింగరేణి ఆర్థిక సంక్షోభానికి ప్రభుత్వాల రాజకీయ జోక్యమే కారణం

**- రూ.53 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి - ఏబీకేఎంఎస్ నాయకుడు పి. మాధవ నాయక్**
**- కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ పూర్తిగా విఫలమయ్యాయని విమర్శ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 8 : సింగరేణి సంస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ జోక్యమే ప్రధాన కారణమని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్-బీఎంఎస్) కార్యదర్శి పి. మాధవ నాయక్ ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన రూ.53 వేల కోట్లకు పైగా బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో ఉప్పు శ్యాంసుందర్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాధవ నాయక్ మాట్లాడుతూ, ట్రాన్స్‌కో, జెన్‌కో తదితర ప్రభుత్వ సంస్థలు సింగరేణి నుంచి బొగ్గు వినియోగిస్తున్నప్పటికీ బిల్లులను సకాలంలో చెల్లించడం లేదన్నారు. దీంతో సింగరేణి తీవ్ర నగదు కొరతలోకి వెళ్లి, కార్మికుల జీతాల చెల్లింపుల కోసం కూడా బ్యాంకుల వద్ద అప్పులు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ సింగరేణిపై అధిక రాజకీయ జోక్యం చేసుకుంటూ సంస్థ స్వతంత్రతను దెబ్బతీశాయని విమర్శించారు. కార్మికుల సమస్యలు పెరుగుతున్నా, ఎన్నికల్లో గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు ప్రభుత్వంపై ఒక్కరోజు కూడా సమర్థవంతమైన పోరాటం చేయలేదని మండిపడ్డారు. సింగరేణికి రావాల్సిన బకాయిల వసూళ్లు, మెడికల్ బోర్డుల నిర్వహణ, కార్మికుల గృహ సమస్యలు, పర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ రీయింబర్స్‌మెంట్, క్యాడర్ స్కీముల అమలు వంటి అంశాల్లో గెలిచిన సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఇప్పుడు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నకిలీ పోరాటాలు చేస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా బొగ్గుగని కార్మికుల 12వ వేతన ఒప్పందానికి సంబంధించి జేబీసీసీఐ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు తక్షణమే మెడికల్ బోర్డులు నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీఎస్ పవన్ కుమార్, ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, ఏరియా సెక్రటరీ వి.నాగప్రసాద్, పిట్ కమిటీ నాయకులు ఉప్పు శ్యాంసుందర్, అయితా రవి, జె. క్రాంతి, ఎంవీ చారి, ఏ.సుబ్బారావు, డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# పుల్లాయిగూడెంలో ఘనంగా ధ్వజస్తంభ

**- అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు**
**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 8 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పుల్లాయిగూడెం గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం, శిఖరయంత్ర సహిత 9 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్, సీతా, లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఆలయంలో నిర్వహించిన ఈ మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రముఖ పూజారి ఆనంద కుమారాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ట, అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట అనంతరం సీతారాముల తిరుకళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారిగా 100కు పైగా విగ్రహ ప్రతిష్టలు, ధ్వజస్తంభ ప్రతిష్టలు నిర్వహించిన ప్రముఖ పూజారి ఆనంద కుమారాచార్యులను కొత్వాల శ్రీనివాసరావు కళ్యాణ వేదికపై శాలువాతో సన్మానించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు బరిపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్న, బండి నాగరాజు, ఉత్సవ నిర్వాహకులు శెట్టిపల్లి తిరుపతయ్య, నీరుడు లెనిన్ కుమార్, సర్పంచ్ పూనెం సూరమ్మ, నీరుడు రఘుబాబు, గుమ్మడి వెంకటేశ్వర్లు, బండి వీరయ్య, పూనెం రాంబాబు, నీరుడు రామకృష్ణ, కోరెం వెంకటేశ్వర్లు, నీరుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానానికి 40 ఏళ్లు పూర్తి

**- సత్తుపల్లిలో ఘనంగా వేడుకలు - ప్రజాసేవకే మా రాజకీయ జీవితం అంకితం**
**- మట్టా రాగమయి, మట్టా దయానంద్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, మే 8 : తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానంలో 40 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించగా, రాష్ట్ర యువ నాయకుడు తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేతలు రాజకీయ కుట్రలో భాగంగానే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఇతర నిర్మాణ పనుల కోసం మట్టి, ఇసుక అవసరం సహజమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రజలకు ఇళ్లు ఇవ్వకుండా అక్రమ మట్టి, ఇసుక రవాణా ద్వారా భూములు దోచుకున్నారని ఆరోపించారు. తాము రాజకీయాల్లోకి రాకపోయి ఉంటే వైద్యులుగా కోట్ల రూపాయలు సంపాదించే వారమని, ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చామని తెలిపారు. "మాకు ఉన్న దాంట్లో పేదలకు సహాయం చేయడమే తెలుసు. తీసుకోవడం తెలియదు. మా ఇంట్లో అవినీతికి చోటు లేదు" అని స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలకు తమ నిజాయితీ తెలుసని పేర్కొన్నారు. ప్రజాసేవకే తమ జీవితాన్ని అంకితం చేశామని, ఎలాంటి పుకార్లకైనా భయపడబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కల్లూరు ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మహిళా, యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు, డీసీసీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- గుడిపాడు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కొత్వాల శ్రీనివాసరావు**
**- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాలకు రైతుల ఘన సన్మానం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 8 : రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లను అధికారులు వేగవంతం చేసి, తూకం పూర్తైన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం పాల్వంచ పట్టణ పరిధిలోని గుడిపాడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లైస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన కొత్వాల, తూకం పూర్తైన తర్వాత కూడా ధాన్యం మిల్లులకు తరలింపులో ఆలస్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల దిగుమతులు ఆలస్యమవుతున్నాయని పేర్కొంటూ, మిల్లుల సంఖ్యను పెంచి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన కొత్వాల శ్రీనివాసరావును రైతు సంఘం నాయకుడు కాల్వ ప్రకాశరావు ఆధ్వర్యంలో రైతులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సొసైటీ చైర్మన్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించిన కొత్వాలతో పాటు పాలకవర్గ సభ్యులను రైతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు కనగాల నారాయణరావు, జరబన సీతారాంబాబు, భూక్యా కిషన్, సీఈఓ జి. లక్ష్మీనారాయణ, స్టాఫ్ అసిస్టెంట్ మురళి, రైతులు కాల్వ ప్రకాశరావు, లోగాని రామారావు, లోగాని సురేష్, శెట్టిపల్లి ముత్తయ్య, యాదయ్య, నక్కా దుర్గారావు, ప్రసాద్, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.



# మాల కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి

**- రూ.2 వేల కోట్లు కేటాయించి మాలల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి - మాల మహానాడు**
**- చేవెళ్ల డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 8 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు మాల కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి, మాలల అభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని మాల మహానాడు భద్రాద్రి జిల్లా మణుగూరు మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం మణుగూరులోని మాల మహానాడు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడు వేర్పుల నరేష్, ప్రధాన కార్యదర్శి బూర్గుల సతీష్ మాట్లాడుతూ, ఇతర కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు కేటాయించడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మాలలు కృషి చేసినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత మాలలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. వర్గీకరణ కారణంగా మాలలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు దూరమయ్యాయని, ఇప్పుడు మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా ఆర్థికంగా కూడా వెనుకబడే పరిస్థితి తీసుకొస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి, సమాజానికి నిబద్ధత కలిగిన నాయకులకు అవకాశం కల్పించి మాలల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు గౌరవ అధ్యక్షుడు మద్దెల భద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వేర్పుల సురేష్, ఉపాధ్యక్షులు బూర్గుల సంజీవరావు, తోట ప్రసాద్, వేల్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

**సుజాతనగర్ పీహెచ్‌సీ, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 8:రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. శుక్రవారం సుజాతనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగాలు, మందుల గది, ల్యాబ్ సేవలు, రోగుల నమోదు పత్రాలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. రక్తపరీక్షలు, ఇతర వైద్య పరీక్షల నిర్వహణ, ఫలితాల అందజేతపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వలను తనిఖీ చేసిన కలెక్టర్, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం సుజాతనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, రవాణా ఏర్పాట్లు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com